PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 78 | విజయవాడ, శనివారం 18 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Saturday 18 October 2025 | Rs

అదానీ సేవలో తరిస్తున్న మోడీ సర్కార్

- భారత గ్రిడ్‌కు గొడ్డా ప్లాంట్ అనుసంధానం
- కొత్త ట్రాన్స్‌మిషన్ పవర్ లైన్‌కు మార్గం సుగమం
- అదానీ పవర్ ప్రణాళికకు మోడీ సర్కార్ గ్రీన్‌సిగ్నల్

7

ఫైనల్‌కు భారత్

నేడు టైటిల్‌కై ఆస్ట్రేలియాతో ఢీ • సుల్తాన్ జొహోర్ కప్

6 లో

పంచాయతీల పునర్ వ్యవస్థీకరణ!

త్వరలో ఉత్తర్వులు? 359 రూర్బన్ పంచాయతీల ఏర్పాటు

కార్యదర్శుల పోస్టులను పిడిగా మార్పు

ఉద్యోగుల సర్వీసుల్లోనూ భారీగా మార్పులు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో గ్రామపంచాయతీల వ్యవస్థలో కీలకమైన మార్పులు తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేస్తోంది. ప్రధానంగా పంచాయతీ కార్యదర్శుల వ్యవస్థలో పలు మార్పులకు సన్నద్ధమైనట్టు సమాచారం. పంచాయతీ కార్యదర్శుల్లో ప్రస్తుతం ఉన్న ఆరంచెల వ్యవస్థను నాలుగు అంచెల వ్యవస్థగా మార్పు చేయనున్నారు. ఈ ప్రతిపాదనకు ఈ నెల పదవ తేదిన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపారు. ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని 26 జిల్లాల జిల్లా పంచాయతీ అధికారుల నుంచి సమగ్ర సమాచారాన్ని కూడా ఇప్పటికే ప్రభుత్వానికి చేరినట్లు సమాచారం, వచ్చే వారంలో దీనికి సంబంధించిన తుది ఉత్తర్వులు వెలువడనున్నాయని సమాచారం. నూతన వ్యవస్థలో గ్రామీణ స్థాయిలో అర్బన్ స్థాయి కలిగిన పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా పరిగణిస్తారు. వీటిని రూర్బన్ (రూరల్, అర్బన్ - ఆర్ అర్బన్) పంచాయతీలుగా నిర్దేశించారు. ఈ పంచాయతీల కార్యదర్శిని రూరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా (ఆర్‌యుడిఒ) పిలుస్తారు. ప్రస్తుత 'ఎ' గ్రేడ్ పంచాయతీ కార్యదర్శులను ఆర్‌యుడిఒగా నియమిస్తారు. రూర్బన్ పంచాయతీలంటే పది వేల జనాభాపైన ఉండి మండల పరిధిలో అత్యధిక ఆదాయం కలిగి ఉండాలి. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 359 పంచాయతీలను ఇప్పటికే గుర్తించారు. ఈ పంచాయతీల కార్యదర్శులు గెజిటెడ్ హోదా కలిగి ఉంటారు. డిప్యూటీ ఎంపిడిఒలను కూడాఈ పంచాయతీలకు కార్యదర్శులుగా నియమించడానికి కసరత్తు జరుగుతోంది. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో నాలుగు స్థాయిలో కార్యదర్శులుగా పనిచేస్తున్నారు. వీరితోపాటు ఆరేళ్ల క్రితం సచివాలయాల్లో ఎంపిక అయిన పంచాయతీ కార్యదర్శులను ఐదు, ఆరు కేటగిరిలో ఉంచారు. ఆరో కేటగిరి కార్యదర్శి చాలా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌గా కంప్యూటర్‌కు సంబంధించిన అంశాల్లో వినియోగిస్తున్నారు. మొత్తం ఆరెంచల వ్యవస్థను నాలుగు అంచెలుగా మారుస్తున్నారు.

రేటూరు పంచాయతీ భవనం

రద్దు కానున్న క్లస్టర్ విధానం

ఈ మార్పులతో ఇప్పటి వరకు ఉన్న గ్రామ పంచాయతీల క్లస్టర్ విధానం రద్దు కానుంది. ప్రస్తుతం ఉన్న 7,244 క్లస్టర్ పంచాయతీల విధానాన్ని రద్దు చేసి, 13,351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర పరిపాలనా మిగతా 7లో

డిజిటల్ అరెస్టుల పట్ల సుప్రీం తీవ్ర ఆందోళన

- కేంద్రానికి, సిబిఐకి నోటీసులు
- ఇన్ని ఫోర్జరీ పత్రాలా? నివ్వెరపోయిన న్యాయస్థానం

న్యూఢిల్లీ : డిజిటల్ అరెస్టుల కేసులు పెరిగిపోతుండడం పట్ల సుప్రీం కోర్టు శుక్రవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముంబయి ఇడి అధికారి హోదాలో ఫోర్జరీ చేసిన సీల్‌ను కలిగివున్న అరెస్టు ఉత్తర్వులను, ఫోర్జరీ చేసిన జ్యుడీషియల్ అధికారుల నిఫూ ఉత్తర్వులను కూడా వారు చూపించడం పట్ల కోర్టు నివ్వెరపోయిందని బెంచ్ పేర్కొంది. ఫోర్జరీ చేసిన కోర్టు ఉత్తర్వులతో, డిజిటల్ అరెస్టు పేరుతో సాగిస్తున్న దురాగతాలను సుమోటోగా తీసుకున్న అత్యున్నత న్యాయస్థానం దీనిపై కేంద్రం, సిబిఐ, హర్యానా ప్రభుత్వాల నుండి స్పందన కోరుతూ నోటీసులు జారీ చేసింది. 27న తదుపరి విచారణ చేపట్టేలోగా దర్యాప్తు స్థితిగతులపై నివేదికను అందజేయాలని ఆదేశించింది. హర్యానాలోని అంబాలాకు చెందిన 70ఏళ్ల మహిళ రాసిన లేఖ నేపథ్యంలో కోర్టు జోక్యం చేసుకుంది. సిబిఐ, ఇడి, జ్యుడీషియల్ అధికారులమని చెప్పుకుని కొంతమంది ఫోన్, వీడియో కాల్స్ చేసి, తనను, తన భర్తను డిజిటల్ అరెస్టు చేసి దాదాపుగా కోటిన్నర రూపాయిలు కాజేయడాన్ని ఆమె ఆ లేఖలో వివరించారు. ఫోర్జరీ చేసిన సుప్రీంకోర్టు ఉత్తర్వులను చూపించారు. తమ జీవితకాలంలో దాచుకున్న మొత్తాలను వివిధ బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేసేలా ఒత్తిడి తీసుకొచ్చారని ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు. దీంతో అంబాలా సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. సాధారణ పరిస్థితుల్లో అయితే దర్యాప్తును వేగవంతం చేయాలనే రాష్ట్ర పోలీసులకు ఆదేశాలు జారీ చేసే వారమని, ఈ కేసులో సుప్రీం కోర్టు పేరుతో అనేక బూటక జ్యుడీషియల్ పత్రాలను ఆ మోసగాళ్ళు సంపాదించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చిలతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. దేశవ్యాప్తంగా కఠిన కార్యాచరణ వుండాలని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాల పోలీసు అధికారులు సంఘటితంగా కృషి చేయాలని పేర్కొంది.

ఖనిజాల విలువెంతో తేల్చండి

- దానికోసం సమగ్ర అధ్యయనం చేయండి
- సమీక్షలో సిఎం చంద్రబాబు ఆదేశం
- విలువ జోడింపుతో మరింత ఆదాయం వస్తుందని సూచన
- వడ్డెర్లకు లీజుల్లో 15 శాతం రిజర్వేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో లభ్యం అవుతున్న ఖనిజాల మొత్తం విలువెంతో తేల్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలోని సచివాలయంలో గనుల శాఖ, ఉచిత ఇసుక విధానంపై ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనికోసం సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల్లో విలువ జోడింపుతో అధిక ఆదాయాన్ని పొందుతున్నట్లు చెప్పారు. మన రాష్ట్రంలోనూ అందుకు తగిన విధంగా ప్లాన్ రూపొందించాలని అన్నారు. విలువ జోడిస్తే రూ.20 వేల కోట్ల నుంచి 30 వేల కోట్లు ఆదాయాన్ని ఖనిజాల నుండి ఆర్జించే అవకాశం ఉంటుందని చెప్పారు. మైనింగ్ కోసం పెండింగ్‌లో ఉన్న 6,500 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. వడ్డెర్లకు మైనింగ్ లీజుల్లో కేటాయింపుల అంశంపై విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు. వడ్డెర్లు, సొసైటీలకు 15 శాతం మేర గనుల్లో రిజర్వేషన్ కల్పించే అంశాన్ని వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మైనింగ్ లీజుల కేటాయింపుతో పాటు ఎంఎస్ఎంఇలుగా ఎదిగేందుకు ప్రస్తుతం ఉన్న పాలసీని అనుసంధానించాలని సూచించారు. రాష్ట్రంలో గనుల తవ్వకాలకు సంబంధించి శాటిలైట్ చిత్రాలు, డ్రోన్ ఆధారిత టెక్నాలజీతో విశ్లేషించాలన్నారు. బీచ్ శాండ్ మినరల్స్ లాంటి భార ఖనిజాల మైనింగ్‌తో పాటు విలువ జోడింపుతో అధిక ఆదాయం సాధించే ఆస్కారం ఉందన్నారు. కడపలో నిర్మించనున్న ఉక్కు ఫ్యాక్టరీకి ముడి ఇనుప ఖనిజం సరఫరాపైన అధ్యయనం చేయాలన్నారు.

ఉచిత ఇసుక ప్రయోజనం ప్రజలకే దక్కాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానంతో ప్రజలందరికీ ప్రయోజనం కలగాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా ఉచిత ఇసుక సరఫరాను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. వ్యవస్థలో ఉన్న లోపాలను వినియోగించుకుని దుర్వినియోగం చేసే అవకాశం లేకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలన్నారు. ఈ సీజన్‌లో 66.50 లక్షల టన్నుల ఇసుకను నిల్వ చేశామని, ప్రస్తుతం అన్ని స్టాక్ పాయింట్లలోను 43 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అధికారులు ఈ సందర్భంగా సిఎంకు వివరించారు. చిట్టచివరి వ్యక్తికీ ప్రయోజనం దక్కేలా ఇసుక పంపిణీ ఉండాలన్నారు. లోడింగ్‌తోపాటు రవాణాకు అతి తక్కువ వ్యయం అయ్యేలా చూడాలని సూచించారు. అంతరాష్ట్ర సరిహద్దుల్లోని అన్ని రూట్లలో పెట్టిన సిసి కెమెరాల నిఘాను మరింత పటిష్టం చేయాలన్నారు. ఆర్‌టిజిఎస్‌లో ఉచిత పంపిణీ విధానంపై పర్యవేక్షించాలన్నారు. ఈ సమీక్షకు గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆ శాఖ ఉన్నతాధికారులు ముఖేష్ కుమార్ మీనా, ప్రవీణ్ కుమార్, ఆర్‌టిజిఎస్ అధికారులు పాల్గొన్నారు.

పెరూలో జన్ జెడ్ నిరసనలు

- అవినీతిపై యువత ఆగ్రహం
- పోలీసు కాల్పుల్లో ఒకరు మృతి
- ఎమర్జెన్సీని ప్రకటించిన ప్రభుత్వం

లిమా : ప్రపంచాన్ని కుదిపేస్తున్న జన్ జడ్ ఉద్యమం లాటిన్ అమెరికా దేశం పెరూకి వ్యాపించింది. అవినీతికి వ్యతిరేకంగా జన్ జడ్ పేరుతో ఆ దేశంలోని యువత గత కొన్ని వారాల నుండి పోరాడుతోంది. రాజధాని లిమాలో కాంగ్రెస్ ముందు జరిగిన భారీ నిరసన ప్రదర్శనలో " మేము యువకులం.. అవినీతి, హింసతో విసిగిపోయాం " అంటూ నినదించారు. ప్రదర్శనను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసు కాల్పుల్లో ఒక యువకుడు మృతి చెందాడు, అనేక మంది గాయపడ్డారు. దీంతో దేశ వ్యాప్తంగా ఘర్షణలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో ఆ దేశ ప్రధాన మంత్రి ఎర్నెస్టో అల్వారెజ్ లామాలో ఎమర్జెన్సీని విధిస్తున్నామని శుక్రవారం ప్రకటించారు. పెరూ దేశంలో అవినీతి తారాస్థాయికి చేరుకుంది. నిరుద్యోగంతో యువత విసిగిపోయింది. నేరాలు అదుపు లేకుండా పోవడంతో పెరువియన్లలో అభద్రత పెరిగిపోయింది. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలంకావడంతో వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు.

ఆగ్రహానికి కారణం..

ఉపాధ్యాయుడైన వామపక్ష పార్టీ నాయకుడు పెడ్రో కాస్టిల్లో 2021వ సంవత్సరంలో ఫ్రీ పెరు పార్టీతో కలిసి పోటీ చేసి అధ్యక్ష ఎన్నికల్లో గెలిచారు. ' ధనిక దేశంలో పేదలు, అట్టడుగు ప్రజలకు ప్రాతినిధ్యం " అనే నినాదంతో విజయం సాధించారు. ఉచిత విద్య, ఉచిత క్యాన్సర్ చికిత్స, చిన్న రైతుల ఆదాయాలు పెంచేందుకు కృషి చేశారు. ఇది సహించని మితవాద శక్తులు 2022లో కుట్ర చేసి పెడ్రోను అభిశంసించి పదవి నుండి తొలగించారు. అప్పటి నుండి పెరు రాజకీయ అస్థిరతను ఎదుర్కొంటోంది. గత తొమ్మిదేళ్లలో ఏడుగురు అధ్యక్షులు మారారు. దీనికి తోడు దేశంలో అవినీతి, హింస పెరిగిపోయాయి. రౌడీ ముఠాలు స్థానిక వ్యాపారులు, బస్ డ్రైవర్లు, సామాన్యుల వద్ద నుండి డబ్బులు వసూలు చేస్తున్నాయి. ప్రశ్నించిన వారిపై దాడులు, హత్యలు పెరిగిపోయాయి. చదువుకున్న యువతకు ఉపాధి గగనమైపోయింది. తక్షణమే ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పోరాటాలను యువత ఉధృతం చేసింది. దీంతో అధ్యక్షురాలు దీనా బోలువార్టే పదవి నుండి తప్పించారు. తరువాత తాత్కాలిక అధ్యక్షుడైన జోస్ జెరి యువతను తీవ్రవాదులుగా అభివర్ణించడంతో మరింత ఆగ్రహించారు. అవినీతి, అసమానతలు తొలగనంత కాలం ప్రజాగ్రహం చల్లారదని, అధ్యక్షుడు జెరి ప్రజా వ్యతిరేక చర్యలతో దేశంలో అశాంతి మరింత విజృంభించే అవకాశం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.

మంత్రి లోకేష్ మాట నిలబెట్టుకోవాలి

- మంగళగిరిలో ఇళ్ల స్థలాలకోసం బైఠాయింపు..
- భారీగా తరలివచ్చిన పేదలు

3

దివీస్‌లో విషవాయువులు లీక్ ?

- ఇద్దరికి అస్వస్థత

2

జనగణన-2027 నోటిఫికేషన్ జారీ

- వచ్చే నెలలో ముందస్తు సర్వే

7

రాష్ట్రానికి మోడీ శఠగోపం

- గూగుల్‌కు రూ.22 వేల కోట్ల సబ్సిడీ ఇవ్వడం అన్యాయం
- రాయలసీమ డిక్లరేషన్‌పై బిజెపి సమాధానం చెప్పాలి
- మోడీ భజన మాని నిధులు రాబట్టాలి
- విలేకరుల సమావేశంలో వి.శ్రీనివాసరావు

మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధాని మోడీ ఆంధ్రప్రదేశ్‌కు శఠగోపం పెట్టారని, రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వడం లేదని, పైగా జిఎస్‌టి సభ పేరుతో రూ.300 కోట్లు ఖర్చు చేసినా రాష్ట్రానికి రూపాయి పెట్టుబడి ప్రకటించలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఆత్మనిర్భర్ భారత్ పేరుతో పేదలను దోచుకుని పెద్దలకు రాయితీలు ఇస్తున్నారని, ఇటువంటి విధానాలను ప్రజలు అంగీకరించరని, తిరగబడతారని హెచ్చరించారు. విజయవాడలోని బాలోత్సవ భవన్లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకరరెడ్డితో కలిసి శ్రీనివాసరావు మాట్లాడారు. కర్నూలులో మోడీ సభ అట్టహాసంగా నిర్వహించారని, ఆయన రాష్ట్రానికి వచ్చిన ప్రతిసారీ రూ.300 కోట్ల నుండి రూ.400 కోట్లు ఖర్చు చేస్తున్నారని, అంటే ఏడాదిలో రూ.1200 కోట్ల నుండి రూ.1500 కోట్లు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. అయినా రాష్ట్రానికి ఎటువంటి హామీ ఇవ్వలేదని అన్నారు. ఒకవైపు ప్రజలపై ధరలు, ఛార్జీలు పెంచుతూ ఇంత ఖర్చు చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. సభలో చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌లు మోడీని పొగడటం తప్ప చేసిందేమీ లేదని అన్నారు. ఇదే సభలో కరెంటుషాక్‌తో అర్జున్ అనే యువకుడు మరణిస్తే వారి కుటుంబాన్ని పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా సిపిఎం, సిపిఐ నాయకులను, అదోనీలో విద్యార్థి నాయకులను అరెస్టు చేశారని అన్నారు. ఈ ప్రభుత్వానికి వామపక్ష పార్టీల కార్యకర్తలంటే ఎందుకంత భయమని ప్రశ్నించారు. మోడీ రాయలసీమకు ఏమి చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రూ.13 వేలకోట్లతో ప్రారంభించిన 16 ప్రాజెక్టుల్లో రాష్ట్రానికి చెందినవి, కర్నూలు జిల్లా, రాయలసీమకు చెందినవి ఎన్నో చెప్పాలని అన్నారు. దేశంలో అన్ని ప్రాజెక్టులను ఇక్కడ నుండి ప్రారంభించి రాష్ట్రానికి ఇచ్చినట్లు ప్రచారం చేశారని విమర్శించారు. విభజన సందర్భంగా కర్నూలు పంచలింగాల వద్ద రైల్వేవ్యాగన్ వర్కుషాపు, ఆదోని వద్ద టెక్స్‌టైల్ పార్కు, కడపలో స్టీలుప్లాంటు ఏర్పాటు చేస్తామని చెప్పినా వాటికి అతీగతి లేదని తెలిపారు. కడప స్టీలు ప్లాంటుకు అయితే శంకుస్థాపనల మీద శంకుస్థాపనలు చేశారని, వాటికి మిగతా 7లో

ఉద్యోగాల పేరుతో మోసం

- రూ.150 కోట్లతో పరారైన హెల్త్ అండ్ వెల్త్ సంస్థ
- ఆందోళనకు దిగిన బాధితులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ (నంద్యాల జిల్లా)

ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి నిరుద్యోగుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసిన హెల్త్ అండ్ వెల్త్ ఫైనాన్స్ సొల్యూషన్ సంస్థ చివరకు బోర్డు తిప్పేసింది. నిరుద్యోగుల డబ్బులతో సంస్థ యజమానులు పరారయ్యారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా దొర్నిపాడులో హెల్త్ అండ్ వెల్త్ ఫైనాన్స్ సొల్యూషన్ సంస్థ తన కార్యాలయాన్ని ప్రారంభించింది. విద్యార్హతను బట్టి ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించింది. ఆశపడ్డ నిరుద్యోగులు అప్పులు చేసి, పొలాలు, ఇళ్లు, బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి అధిక వడ్డీలకు అప్పులు చేసి డబ్బులు చెల్లించారు. ఆళ్లగడ్డ నియోజవర్గంలోని సుమారు 5000 మంది నుంచి రూ.150 కోట్లు ఆ సంస్థ వసూలు చేసింది. డబ్బులు చెల్లించినప్పటికీ ఉద్యోగాలు రాకపోవడంతో సంస్థ యజమానులను బాధితులు ప్రశ్నిస్తే త్వరలోనే ఆఫర్ లెటర్లు వస్తాయని నమ్మించారు. రోజులు గడిచిపోతుండడం, తీసుకున్న అప్పులకు వడ్డీలు పెరిగిపోతుండడంతో ఆగ్రహించిన నిరుద్యోగులు ఆ సంస్థ కార్యాలయం వద్దకు చేరుకుని నిలదీశారు. ఒకటి, రెండు రోజుల్లో ఉద్యోగాలు ఇస్తామని ఆ సంస్థ ప్రతినిధులు సర్దిచెప్పారు. అయినప్పటికీ ఉద్యోగాలు రాకపోవడంతో కార్యాలయం వద్దకు వెళ్లగా తలుపులు మూసి ఉంది. దీంతో మోసపోయామని గ్రహించిన నిరుద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో మంగళ వారం నుంచి దొర్నిపాడులోని సంస్థ కార్యాలయం ఎదుట నిరుద్యోగులు నిరసన దీక్ష చేపట్టారు. సంస్థ యజమానులు వీరారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, బాచిరెడ్డి శ్రీకాంత్ రెడ్డిని అరెస్టు చేసి తమ డబ్బులు ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు. దీక్షా స్థలం వద్దకు గురువారం డిఎస్‌పి వచ్చి ఆరా తీశారు. సమస్యను పరిష్కరిస్తామని చెప్పి వెళ్లిపోయారు.

బాధితులకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్

సిపిఎం సంఘీభావం

దీక్షా శిబిరాన్ని సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.రామచంద్రుడు, జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్ సందర్శించారు. బాధితుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. మోసగించిన వారిని వెంటనే అరెస్ట్ చేసి, వారి నుండి డబ్బులు రికవరీ చేసి బాధితులందరికీ ఇప్పించాలని డిమాండ్ చేశారు. బాధితులు చేసే అన్ని రకాల పోరాటాలకు సిపిఎం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు శివ, మనోహర్, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులపై క్రమశిక్షణ కేసులు

డిసిడిబిలో నమోదు

- సాధారణ పరిపాలనా శాఖ ఆదేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగులపై నమోదైన క్రమశిక్షణ కేసుల పెండింగ్ వివరాలను ఈ నెల 23లోగా డేటా ఎంట్రీ పూర్తి చేయాలని సాధారణ పరిపాలనా శాఖ.. అన్ని శాఖల హెచ్ఒడిలకు సూచించింది. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ రావత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల వివరాల డేటా బేస్ (డిసిడిబి) నిధిలో డేటా ఇన్-పుట్ స్క్రీన్ మాస్టర్ డేటా మాడ్యూల్ కింద డిడిఒ లాగిన్‌లో డేటా ఎంట్రీ చేయాలని పేర్కొంది. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన క్రమశిక్షణ కేసుల డేటా బేస్ పెండింగ్ లేదా ఇతరత్రా కేసుల వివరాలు, ప్రస్తుతం వాటి స్థితికి సంబంధించిన సమాచారాన్ని నమోదు చేయాలని ఆర్థికశాఖ అన్ని డ్రాయింగ్, డిస్బర్సింగ్ అధికారులకు (డిడిఒలు) ఆదేశాలు జారీ చేసింది. 5,51,592 మంది ఉద్యోగులకు సంబంధించిన డేటాను ఇప్పటి వరకు నమోదు చేయగా, 13,255 మంది ఉద్యోగులకు సంబంధించిన డేటా పెండింగ్‌లో ఉన్నట్లు సాధారణ పరిపాలనా శాఖ పేర్కొంది. నమోదు కాని ఉద్యోగుల చిరునామా నమోదు ప్రకారం ఈ నెల 23 నాటికి డేటా ఎంట్రీని పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

27నుంచి ధాన్యం కొనుగోలు

రైస్ మిల్లర్ల సమావేశంలో మంత్రి నాదెండ్ల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ఈనెల 27వ తేది నుండి ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలోని తాజ్ హోటల్‌లో ఎపి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఈ సీజన్‌లో 3,013 రైతు సేవా కేంద్రాలు, 2061 పిపిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, 10,700మంది సిబ్బందితో ధాన్యం సేకరణకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం చేసిన రూ.1,674 కోట్ల బకాయిలను తీర్చడంలోనూ, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మిల్లర్లకు చెల్లించాల్సిన రూ.763 కోట్లను చెల్లించడం ద్వారా కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుందన్నారు. గతేడాది 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కొన్ని జిల్లాల్లో రైస్‌మిల్లుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రియల్ టైమ్ గవర్నెన్స్ చేసి చూపిస్తామన్నారు. వాట్సాప్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకోవచ్చుని, హాయ్ అని పంపగానే కొనుగోలు ప్రకియ ప్రారంభమవుతుందని అన్నారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. పిడిఎస్ బియ్యం స్మగ్లింగ్ అరికట్టడంలో రైస్ మిల్లర్లు ప్రభుత్వం తోడుగా నిలవాలని అన్నారు. గతేడాది అనుభవంతో తేమ శాతం కొలిచే యంత్రాలు, రవాణా సదుపాయాలు, క్వాలిటీ గన్నీ బ్యాగులు ముందుగానే సిద్ధం చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. సమస్య పరిష్కారానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని, పనిచేసే విధానం పారదర్శకంగా ఉండాలని అన్నారు. క్వాలిటీ గన్నీ బ్యాగులు అవసరమైనన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు లేకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. తేమ శాతం నిర్ధారించే విషయంతోపాటు ట్రాన్స్‌పోర్టు విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై కమిషనరు సౌరభ్‌గౌర్, సివిల్ సప్లై ఎమ్‌డి ఢిల్లీరావు, కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్ గోవిందరావు, ఎఫ్‌సిఐ జిఎం విజయ్‌కుమార్ యాదవ్, ఎపి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వల్లూరి సూరి ప్రకాష్‌రావు, కోశాధికారి రంగయ్యానాయుడు, 26 జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.ఐదు లక్షలు అందజేస్తున్న విద్యుత్ శాఖాధికారులు

ప్రధాని సభ వద్ద మృతిచెందిన అర్జున్ కుటుంబానికి ఆర్థికసాయం

- విద్యుత్ శాఖ ద్వారా రూ.5 లక్షల పరిహారం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఈ నెల 16న ప్రధాని సభకు వచ్చి విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన అర్జున్ కుటుంబానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు ఎపిఎస్‌పిడిసిఎల్ తరుపున రూ.ఐదు లక్షలు శుక్రవారం అందజేశారు. ఎం.అర్జున్ మృతదేహానికి ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి లోతేటి శివశంకర్ విద్యుత్ శాఖ తరపున నివాళులర్పించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కనిగిరి ఎమ్మెల్యే ఎం.ఉగ్ర నరసింహారెడ్డి, విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఆర్.ప్రదీప్ కుమార్, వారి సిబ్బంది అర్జున్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎస్ఎస్ఎల్ఆర్‌తో సర్వే ఆఫ్ ఇండియా ఎంఒయు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సర్వే సెటిల్‌మెంట్ ఆఫ్ ల్యాండ్స్ రికార్డ్సు శాఖ, సర్వే ఆఫ్ ఇండియా మధ్య శుక్రవారం విజయవాడలో ఎంఒయు జరిగింది. ఈ ఒప్పందంతో 70 కార్స్ స్టేషన్లు జాతీయ సార్స్ నెట్వర్క్‌తో అనుసంధానం కానుంది. ఈ కార్యక్రమంలో సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా హితేష్‌కుమార్ ఎస్ మఖవాన, అదనపు సర్వేయర్ జనరల్ నిర్మలెందు కుమార్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, డైరెక్టర్ సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్సు రోణంకి కూర్మనాథ్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మెప్మా ద్వారా రూ.1.25 కోట్ల రుణం

- వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్ ప్రెన్యూర్ కింద ప్రోత్సాహం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్ ప్రెన్యూర్ కార్యక్రమం కింద మెప్మా ఆధ్వర్యాన శుక్రవారం ఒక్కరోజే రూ.1.25 కోట్ల రుణం మంజూరు చేశారు. మంగళగిరిలోని శ్రీసాయికృష్ణ స్వయం సహాయక సంఘం సభ్యులు వై మాధురి నేతి ఉత్పత్తుల పరిశ్రమ కోసం పిఎంఎఫ్ఎంఇ లోన్‌కు దరఖాస్తు చేశారు. దీనిపై స్టేట్ బ్యాంకు అధికారులు రూ.1.25 కోట్ల రుణాన్ని మంజూరు చేశారు. రాష్ట్రంలో ఒక సభ్యురాలికి విడుదల చేసిన అత్యధిక రుణంగా రికార్డుల్లో నిలిచింది. ఈ కార్యక్రమంలో మెప్మా డైరెక్టర్ తేజ్‌భరత్, ఎస్‌బిఐ జనరల్ మేనేజర్ ఎఆర్‌వి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో నేడు మంత్రివర్గ ఉపసంఘం భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు శనివారం మధ్యాహ్నం 12 గంటలకు సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం.. ఉద్యోగ సంఘాలతో భేటీ కానుంది. ఈ సమావేశంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్-ఎస్ రావత్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ పాల్గొననున్నారు. ఈ భేటీలో గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొననున్నారు.

కుమార్తె ఆచూకీ తెలియక 13 ఏళ్లు

- ఆ తల్లిదండ్రుల బాధ పట్టదా?
- కోర్టుకు హాజరైన ఎస్‌పిని ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

ఓ వివాహిత 13 ఏళ్ల క్రితం కనబడకుండాపోతే పోలీసుల దర్యాప్తు నత్తనడకగా కొనసాగడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తన కూతురు జీవించి ఉందో లేదో అనే తల్లిదండ్రుల ఆందోళన పోలీసులకు పట్టదా? అని ప్రశ్నించింది. తన కుమార్తెను కట్టుకున్న అల్లుడిపైనే అనుమానం ఉందని ఫిర్యాదు చేసినప్పటికీ సదరు వ్యక్తిని ఐదేళ్లుగా ఎందుకు విచారించలేదని నిలదీసింది. గతంలో ఆదేశించిన మేరకు శుక్రవారం హైకోర్టు విచారణకు పశ్చిమ గోదావరి జిల్లా ఎస్‌పి, కొవ్వూరు డిఎస్‌పి, తాడేపల్లిగూడెం ఎస్‌హెచ్‌ఒలు స్వయంగా హాజరయ్యారు. ఈ వ్యవహారంపై తాజాగా పురోగతితో కూడిన నివేదిక అందజేయాలని, స్థాయీ నివేదికను తమ ముందుంచాలని జస్టిస్ బట్టు దేవానంద్ ఆదేశించారు. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు. పోలీసుల కేసు దర్యాప్తు తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. జీలుగుమిల్లి మండలం, కామయ్యపాలెం గ్రామానికి చెందిన బండారు ప్రకాశరావు తన కుమార్తె మంగాదేవిని దండగర్ర గ్రామానికి చెందిన మోహన బ్రహ్మాజీ అనే వ్యక్తికిచ్చి వివాహం చేశారు. 2012 అక్టోబరు 18న ప్రకాశరావుకు ఆయన అల్లుడు బ్రహ్మాజీ ఫోన్ చేసి మంగాదేవి కనిపించడం లేదని చెప్పారు. దీంతో తాడేపల్లిగూడెం పోలీసులకు ప్రకాశరావు ఫిర్యాదు చేశారు. కేసు పురోగతి లేకపోవడంపై ప్రకాశరావు 2017లో హైకోర్టులో పిటిషన్ వేశారు. కేసు దర్యాప్తు తీరుపై సందేహాలు వ్యక్తమైన నేపథ్యంలో ఎస్‌పి ఇతర పోలీసులను కోర్టుకు పిలిపించి న్యాయమూర్తి స్వయంగా విచారణ జరిపారు.

ట్రంప్ వాణిజ్య సుంకాలతో

దేశ ఆర్థిక వ్యవస్థపై పెనుప్రభావం

- 13 గంటల పని విధానంతో శ్రమ దోపిడీకి చట్టబద్ధత కల్పించిన మోడీ
- పల్నాడు సదస్సులో వి శ్రీనివాసరావు

సదస్సులో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

ట్రంప్ వాణిజ్య సుంకాలతో మనదేశ ఆర్థిక వ్యవస్థపై పెనుప్రభావం పడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. 13 గంటల పని విధానంతో శ్రమదోపిడీకి మోడీ చట్టబద్ధత కల్పించారని విమర్శించారు. 'ట్రంప్ ఉగ్రవాద నిర్ణయాలు - భారతదేశంపై ప్రభావం' అనే అంశంపై పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ ఆంజనేయులు అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సులో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రంప్ టారిఫ్ ఉగ్రవాదం బ్రహ్మరాక్షసిలా మనదేశాన్ని పట్టిపీడిస్తోందని, అమెరికాలో ఉన్న 45 లక్షల మంది భారతీయ విద్యార్థులు, ఉద్యోగుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని తెలిపారు. రష్యా నుండి ఆయిల్ కొనుగోలు చేయబోమని మోడీ చెప్పినట్లు ట్రంప్ ప్రకటించారని, మనదేశాన్ని పాలిస్తుంది భారతదేశ ప్రభుత్వమా? అమెరికా అధ్యక్షుడా? అనే పరిస్థితి నెలకొందని అన్నారు. రష్యా నుండి మనదేశం ఆయిల్ కొనుగోలు చేయకపోతే దేశంలో ఆయిల్ సంక్షోభం ఏర్పడుతుందని, ఇది భారతీయ సార్వభౌమత్వానికి కూడా ప్రమాదమని వివరించారు. ఇప్పటికే దేశంలో వ్యవసాయ రంగం, అనుబంధ రంగాలు సంక్షోభంలో ఉన్నాయని, ట్రంప్ వాణిజ్య సుంకాలతో మరింత సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. ట్రంప్ వీసాల వేధింపుపై ప్రధాని మోడీ మౌనంగా ఉండడం శోచనీయమన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశ్నించాలని కోరారు. అమెరికా ఆంక్షలకు చైనా దీటుగా సమాధానం చెబుతోందని, మోడీ నోరు మెదపడం లేదన్నారు. అమెరికా ఒత్తిడికి లొంగి దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టడాన్ని సిపిఎం ఖండిస్తోందన్నారు. ఆమెరికా ఆంక్షలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని కోరారు.

పి4 అంటే పెట్టుబడి లేకుండా ప్రయివేటు కంపెనీలకు పెత్తన ఇవ్వడమే

పి4 అంటే పైసా పెట్టుబడి లేకుండా ప్రైవేట్ కంపెనీలకు పెత్తనం అప్పజెప్పడమేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇటువంటి విధానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకురావడం శోచనీయమన్నారు.

గూగుల్ కంపెనీకి ఇస్తున్న రూ.22 వేల కోట్ల రాయితీలతో, మోడీ పర్యటనలకు చేస్తున్న రూ.వందల కోట్ల ఖర్చుతో రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలను పూర్తి చేయవచ్చని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ఆ దిశగా ముఖ్యమంత్రి ఆలోచన చేయడం లేదన్నారు. రాష్ట్రంలో ఇళ్ల స్థలాల కోసం లక్షల మంది పేదలు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదని, కార్పొరేట్లకు మాత్రం వేలాది ఎకరాలు కట్టబెడుతున్నారని వివరించారు. ఒకవైపు టెక్నాలజీ పెరుగుతోందని చెబుతూనే, 13 గంటల పని విధానానికి చట్టబద్ధత కల్పించి కార్మికులను పీల్చిపిప్పి చేస్తున్నారన్నారు. పెరిగిన టెక్నాలజీతో పని గంటల తగ్గించాల్సి ఉండగా పెంచడం ఏంటని ప్రశ్నించారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 16 వేల ఉపాధ్యాయ కొలువులు ఇచ్చిందన్నారు. అయితే, 4.70 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామని అసత్య ప్రచారం చేస్తోందని వివరించారు. పదవీ విరమణ పొందిన వారి స్థానంలో కూడా ఇన్‌ఛార్జులు పని చేస్తున్నారని, 4.70 లక్షల కొలువులు ఎవరికి, ఎక్కడ ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల పేరిట భూములను తీసుకున్న కంపెనీలు పరిశ్రమలను స్థాపించలేదని వివరించారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి కృష్ణయ్య మాట్లాడుతూ ట్రంప్ సుంకాలు, షరతుల ప్రభావం మనదేశంలోని వ్యవసాయ, అనుబంధ రంగాలపై చూపుతున్న తీవ్ర ప్రభావాన్ని వివరించారు. గతేడాది వంద లక్షల బేళ్ల పత్తి దిగుమతి అవడంతో మన దేశంలో పత్తి ధర సగానికిపైగా పడిపోయిందని తెలిపారు. ప్రస్తుతం ఏ పంటలు వేయాలో అర్థం కాని రైతులు మొక్కజొన్నవైపు మొగ్గు చూపారన్నారు. ఈ పంట కూడా దిగుమతి అయితే, దీని ధరలు మరింత పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలో భారతీయ సినిమాలపై సైతం సుంకాలు విధించి ట్రంప్ తన పైశాచికత్వాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివిన భారతీయ విద్యార్థి అమెరికాలో ఉద్యోగం కావాలంటే ట్రంప్ వీసా వేధింపులతో రూ.85 లక్షలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సదస్సులో సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, ఏపూరి గోపాలరావు, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ సిసిఎల్ఎకు విఆర్ఎల సంఘం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విఆర్ఎలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిసిఎల్ఎ జయలక్ష్మికి శుక్రవారం విఆర్ఎల సంఘం వినతిపత్రం అందజేసింది. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బందగీ సాహెబ్, కె ఉమామహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు వడ్డే బాజీబాబు ఉన్నారు. ఈ సందర్భంగా రెండు రోజులు విజయవాడలో రిలే నిరాహార దీక్షలు, 15న ధర్నా నిర్వహించిన విషయాన్ని నేతలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణలో అమలవుతున్న విధంగా విఆర్ఎలకు పే స్కేల్ చెల్లించేలా ప్రభుత్వానికి తెలియజేయాలని, నైట్ డ్యూటీలు రద్దు చేయాలని, అర్హులైన విఆర్ఎలకు ప్రమోషన్స్ ఇవ్వాలని, నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని కోరారు. డిఎను జీతంలో కలపాలని సిసిఎల్ఎను కోరారు. విఆర్ఎల సమస్యలపై చర్చించేందుకు దీపావళి తర్వాత తమ సంఘ నాయకత్వానికి సమయం కేటాయిస్తామని హామీనిచ్చినట్లు నేతలు పేర్కొన్నారు.

'మధ్యాహ్న భోజన' కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- జాయింట్ డైరెక్టర్ గంగాభవానికి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం కింద పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు వెటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి వరలక్ష్మి, దయా రమాదేవి శుక్రవారం మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల పారిశుధ్యం జాయింట్ డైరెక్టర్ గంగాభవానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కార్మికులకు రాష్ట్రప్రభుత్వం కనీసం రూ.10 వేలు వేతనంగా ఇవ్వాలని, గ్యాస్ సిలిండర్‌లు, గ్యాస్ స్టవ్‌లు ప్రభుత్వమే ఇవ్వాలని అన్నారు. 9, 10 తరగతులకు వండి పెట్టే కార్మికులకు వేతనాలివ్వాలని, వంటచేసే కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. ప్రతినెలా 5వ తేదీ లోపు బిల్లులు, వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి నాగమణి, సహాయ కార్యదర్శి జి సమ్మక్క, కార్మికులు సుబ్రమణ్యం, లలిత కుమారి పాల్గొన్నారు.

వికలాంగులపై కూటమి ప్రభుత్వం వేధింపులు : సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వికలాంగులను కూటమి ప్రభుత్వం వేధిస్తోందని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. వికలాంగులకు వైసిపి ప్రభుత్వంలోనే రక్షణ ఉండేదని పేర్కొన్నారు. వైసిపి వికలాంగుల విభాగం రాష్ట్ర కమిటీ, అన్ని జిల్లాల అధ్యక్షులతో శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సజ్జల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగులకు సమాన హక్కులు కల్పించడం లక్ష్యంగా జగన్ పనిచేశారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వేర్వేరు కారణాలతో వారిని వేధింపులకు గురిచేస్తోందన్నారు.

లోకేష్‌ను ఎదిరించినందుకు అక్రమ కేసు

మంత్రి లోకేష్‌ను ఎదిరించినందుకు దుగ్గిరాల వైసిపి నాయకులు వీరయ్యపై అక్రమ కేసులు బనాయించారని వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం మనోహర్‌రెడ్డి విమర్శించారు. నకిలీ మద్యానికి వ్యతిరేకంగా ధర్నా చేసినా కేసు నమోదు చేశారని తెలిపారు. రాష్ట్రంలో కూటమి అరాచకాలను ఎదిరించే వారిపై వేధింపులు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. గతంలో జరిగిన హత్యకేసుతో సంబంధం లేకపోయినా వీరయ్యను అందులో ఇరికించారని తెలిపారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపైనా కేసు నమోదు చేశారని పేర్కొన్నారు.

పిహెచ్‌సి వైద్యులకు ఉద్యోగోన్నతులు

- ఎపి పిహెచ్‌సిడిఎ అసోసియేషన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు టైమ్ బౌండ్ ఉద్యోగోన్నతులు కల్పించాలని ఎపి పిహెచ్‌సిడిఎ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్ర నాయక్ డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నా చౌక్‌లో అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 14వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిహెచ్‌సి వైద్యులు దశాబ్దాల తరబడి పనిచేసినా అదే పోస్టులో ఉద్యోగ విరమణ చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చి ఒప్పుకున్న, డిమాండ్లనే అమలు చేయమంటున్నామని తెలిపారు. ఈ దీక్షల్లో సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానేశ్వర్, వైద్యులు మేమీత్, రాజీవ్ కుమార్, మోహన, నరేష్, సుమన, రంజిత్, దిర్యా జ్యోతి, వికాస్, నిషిత్, లిల్లీ తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి వైద్యులు వెంటనే విధుల్లో చేరాలి

ప్రజారోగ్యం దృష్ట్యా వెంటనే విధుల్లో చేరాలని పిహెచ్‌సి వైద్యులకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ విజ్ఞప్తి చేశారు. పిడి మెడికల్ ఇన్ సర్వీస్ కోటాలో ఈ ఏడాది 20 శాతం సీట్లను స్పెషాల్టీ కోర్సుల్లో కలిపి కేటాయిస్తామని, గతంలో ఇచ్చిన హామీపై ఉత్తర్వులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో పిహెచ్‌సి వైద్యుల సంఘం నేతలతో ఆయన శుక్రవారం చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అలవెన్స్‌లు, ఇతర డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. విధులకు వైద్యుల హాజరుపై వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. 2026-27 నుంచి కనీసం మూడేళ్లపాటు 15 శాతం ఇన్ సర్వీసు కోటా సంఘం నాయకులు కోరుతున్నారని, ఈ విషయంలో నవంబరులో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాన్ని తీసుకుంటుందన్నారు.

ఎనిమిదేళ్లయినా కౌంటర్ వేయని పోలీసులపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

సివిల్ వివాదంలో పోలీసుల జోక్యమనే వ్యవహారంలో పోలీసులు ఎనిమిదేళ్లుగా ఎందుకు కౌంటర్ పిటిషన్ దాఖలు చేయలేదని హైకోర్టు ప్రశ్నించింది. కోర్టు ఆదేశించినా పోలీసులకు పట్టడం లేదని, నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోందని ఆగ్రహించింది. పోలీసులు కౌంటర్ దాఖలు చేసే వరకు కోర్టు ఎదురుచూడాలా? అని ప్రశ్నించింది. ఎనిమిదేళ్లకు కౌంటర్ దాఖలుకు తమ అనుమతి కోరడాన్ని ఆక్షేపించింది. కౌంటర్ దాఖలుకు అనుమతిస్తూనే రూ.10 వేలు ఖర్చులను హైకోర్టు అడ్వకేట్ల క్లర్కుల సంఘానికి చెల్లించాలని అనంతపురం జిల్లా, ధర్మవరం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ పి నాగేంద్ర ప్రసాద్‌ను ఆదేశించింది. విచారణను ఈ నెల 24కు వాయిదా వేస్తూ జస్టిస్ బట్టు దేవానంద్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

తమ సివిల్ వివాదంలోకి కొందరితో కలిసి పోలీసులు జోక్యం చేసుకుంటున్నారంటూ ధర్మవరానికి చెందిన ఎ రాజశేఖర్ 2017లో పిటిషన్ వేశారు. గత వారం జరిగిన విచారణకు ధర్మవరం వన్‌టౌన్ సిఐ నాగేంద్ర ప్రసాద్ వ్యక్తిగతంగా హైకోర్టు విచారణకు హాజరయ్యారు. లక్ష్మీదేవమ్మ అనే మహిళ నుంచి అందిన ఫిర్యాదు మేరకు పిటిషనర్ రాజశేఖర్‌పై కేసు నమోదు చేశామని 2017లో చెప్పిన దానికి భిన్నంగా ఇప్పుడు చెప్పారు. పిటిషనర్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని ప్రసాద్ అన్నారు. దీంతో హైకోర్టు సుమోటో కోర్టు ధిక్కరణ పిటిషన్‌గా విచారణ చేపట్టింది. నాగేంద్ర ప్రసాద్‌కు నోటీసులిచ్చింది. కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో చెప్పాలని ఆదేశించింది. కోర్టు ఖర్చులు విధించి విచారణను వాయిదా వేసింది.

తిరుపతి కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుచానూరు సమీపంలో ఉన్న తిరుపతి కలెక్టరేట్‌లో బాంబు పెట్టామని మెయిల్స్ ద్వారా కలెక్టర్‌కు సమాచారం అందింది. విషయం తెలుసుకున్న తిరుపతి పోలీసులు డాగ్, బాంబ్‌స్క్వాడ్‌తో కలెక్టర్, జెసి ఛాంబర్లతో పాటు అన్ని డిపార్ట్‌మెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బాంబుకు సంబంధించిన ఆనవాళ్లు ఎక్కడా కనబడకపోవడంతో పోలీసులు, ఉన్నతాధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గత 15 రోజులుగా తిరుపతిలో బాంబు బెదిరింపులు కలకలం సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు కలెక్టరేట్‌కు వెళ్లి తనిఖీలను పర్యవేక్షించారు. తమిళనాడు నుంచి తిరుపతిజిల్లా కలెక్టరేట్‌కు మెయిల్ వచ్చినట్లుగా గుర్తించారు.

తిరుపతిలోని ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

రెగ్యులరైజ్ చేయాల్సిందే

డిస్కం, ఎస్ఇ కార్యాలయాల ఎదుట విద్యుత్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - యంత్రాంగం

తమను రెగ్యులర్ చేయాలని, వేతన వ్యత్యాసాలని సవరించాలని కోరుతూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు), ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు శుక్రవారం ఆందోళనలు చేపట్టారు. డిస్కం, ఎస్ఇ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు.

తిరుపతిలో ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికవర్గ ప్రయోజనాలకు అనుగుణంగా చట్టాలు మార్చాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ విధానాలనే ప్రస్తుత ప్రభుత్వమూ అమలు చేస్తోందని విమర్శించారు. యూనియన్ కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ... కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేయకపోతే సమ్మెలోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. శ్రీకాకుళంలోని ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం, ఎస్ఇ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. విశాఖపట్నంలోని గ్రీన్‌పార్క్ హోటల్‌కు ఎదురుగా ఉన్న ఎలక్ట్రికల్ ఎస్ఇ కార్యాలయం వద్ద, అనకాపల్లి జిల్లా కేంద్రంలోని గవరపాలెంలో ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వద్ద, అల్లూరి జిల్లా సీలేరు జెన్‌కో ఎస్ఇ కార్యాలయం వద్ద ఆందోళనలు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న విద్యుత్ ఎస్ఇ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

విద్యుత్ శాఖ స్ట్రగుల్ జెఎసి జిల్లా చైర్మన్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ... విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు తెలంగాణలో చేసినట్లు సంస్థల్లో విలీనం చేసి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జెఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని కోరారు. కడప, రాయచోటిలోని ఎస్ఇ కార్యాలయాలు, ఎర్రగుంట్లలోని ఆర్‌టిపిపి వద్ద నిరసన తెలిపారు.

శనగ రైతులను ఆదుకుంటాం : మంత్రి అచ్చెన్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రబీ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా శనగ పంట సాగుచేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు ప్రయోజనాలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో రైతుల కోసం కొత్త ఆలోచనలు, సాంకేతికతను ఉపయోగించి వ్యవసాయం లభదాయకంగా మార్చాలనే లక్ష్యంతో నూతన విధానాలను అమలు చేస్తున్నామన్నారు.

మంత్రి అచ్చెన్నకు ఎఒల అభినందనలు

గత ఎనిమిదేళ్లుగా పరిష్కారానికి నోచుకోని వ్యవసాయ అధికారులు (ఎఒ) ఉద్యోగోన్నతుల విషయంలో సమస్యలను పరిష్కరించిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు ఎపి వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు కె బాలభాస్కర్, కార్యదర్శి డి ప్రవీణ్, ఇతర నాయకులు అభినందనలు తెలిపారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతాంగానికి అన్ని వేళలా అందుబాటులో ఉంటూ దిగుబడులను పెంచి, వ్యవసాయం లాభసాటిగా ఉండేలా నూతన వ్యవసాయ సాంకేతిక విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఎపి పర్యాటకాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న జెవివి ప్రతినిధి బృందం

రుషికొండ ప్యాలెస్‌ను శాస్త్ర సాంకేతిక మ్యూజియంగా మార్చాలి

- జన విజ్ఞాన వేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖలోని రుషికొండ ప్యాలెస్‌ను శాస్త్ర సాంకేతిక, సాంస్కృతిక మ్యూజియంగా తీర్చిదిద్దాలని జన విజ్ఞాన వేదిక (జెవివి) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపి పర్యాటకాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి పద్మావతిని, జెవివి ప్రతినిధి బృందం శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. రుషికొండ ప్యాలెస్‌ను ఏ విధంగా ఉపయోగించుకోవచ్చనే అంశంపై సూచనలు, సలహాలు ఇవ్వాలని ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని కోరడంతో వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె శ్రీనివాస్ మాట్లాడుతూ.. రిషికొండ ప్యాలెస్‌ను విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం - బెంగళూరు తరహాలో అభివృద్ధి చేస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆకర్షణీయ కేంద్రంగా మారి, పర్యాటకరంగ అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎపిటిడిసి కార్యనిర్వహణాధికారి పద్మావతి తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శులు మహేష్, రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

టిటిడి ఇఒకు కౌంటర్ వేసే తీరిక లేదా?

- హైకోర్టు ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల శ్రీవారి పరకామణి నుంచి రూ.72 వేలు విలువ చేసే 900 అమెరికన్ డాలర్ల చోరీ కేసును నిందితుడితో రాజీ చేసుకున్న వ్యవహారంలో టిటిడి ఇఒ కౌంటర్ పిటిషన్ వేయకపోవడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. పరకామణిలో ఎప్పుడో దొంగతనం జరిగితే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించింది. టిటిడి నిద్రపోతోందని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారాన్ని సిఐడికి అప్పగించాలనే పిటిషన్‌పై వివరణ ఇచ్చేందుకు స్వయంగా విచారణకు హాజరుకావాలని టిటిడి ఇఒకు ఆదేశాలు జారీ చేయబోయింది. టిటిడి న్యాయవాది శ్రీనివాసబాబా పలుమార్లు కోరడంతో ఇఒ వ్యక్తిగత హాజరు ఉత్తర్వులు ఇవ్వలేదు. రూ.20 వేలను ఖర్చుల కింద చెల్లించాలని ఇఒను ఆదేశించింది. ఈ మొత్తాన్ని హైకోర్టు న్యాయవాదుల సంఘానికి చెల్లించాలని జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం ఆదేశాలిచ్చారు. సిఐడి సీజ్ చేసిన రికార్డులను హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు సమర్పించాలని ఆదేశించారు. విచారణ ఈ నెల 27కు వాయిదా పడింది.

విశాఖకు వివిధ సంస్థలు రాక : ఎంపి పెమ్మసాని

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖపట్నానికి వివిధ సంస్థలు వస్తున్నాయని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఒక ప్రాంతంలో పరిశ్రమలు రావడానికి కావాల్సిన ఎకో సిస్టమ్స్‌ను అభివృద్ధి చేయడానికి అనేక రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. అయితే, ఒకసారి ఎకో సిస్టమ్ ఏర్పాటైన తర్వాత రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని అన్నారు. ప్రస్తుతం గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ఖరారైన తర్వాత, చాలా సంస్థలు విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నాయని అన్నారు. దేశంలో బెంగళూరు వంటి ప్రాంతాల్లో ఒక ఎకో సిస్టం ఏర్పాటైందని, ఆ ప్రాంతంతో విశాఖపట్నానికి పోలిక అవసరం లేదని అన్నారు. ఖర్చులు ఎక్కువ, ఆదాయం తక్కువగా ఉండే పోస్టల్ డిపార్ట్మెంట్ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రూ.5 వేల కోట్ల నిధులతో పోస్టల్ సంస్థ నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బిఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరచడానికి దాదాపు 20 వేల కొత్త సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వినియోగదారుల భద్రత కోసం సంచార్ సాతి యాప్ సేవలను అందిస్తున్నామన్నారు.

దివీస్‌లో విషవాయువులు లీక్ ?

- ఇద్దరికి అస్వస్థత

ప్రజాశక్తి - తగరపువలస (విశాఖ జిల్లా)

విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీస్‌లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తోటి కార్మికుల కథనం ప్రకారం.. శాంపిల్స్ సేకరిస్తుండగా విషవాయువులు లీకయ్యాయి. టెక్నీషియన్స్ వినయ్ కుమార్, హేమంత్ విషవాయువును పీల్చి అస్వస్థతకు గురయ్యారు. దీంతో, వారిని స్థానిక ఆస్పత్రికి, ఆ తరువాత మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఆరిలోవ అపోలో ఆసుపత్రికి తరలించారు. బాధిత కార్మికులను శుక్రవారం ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు డాక్టర్ పంచకర్ల సందీప్ పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాద ఘటనపై దివీస్ యాజమాన్యం గోప్యత పాటిస్తోంది. పోలీసులు కూడా వివరాలు వెల్లడించలేదు.

సమగ్ర దర్యాప్తు జరపాలి : సిఐటియు

దివీస్‌లో జరిగిన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి, ఎస్.అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన తర్వాత కూడా ఆ విషయాన్ని సదరు కంపెనీ బయట ప్రపంచానికి తెలియకుండా కప్పిపుచ్చడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. తాజా ప్రమాదానికి కారణాలను తెలుసుకొనేందుకు వెంటనే ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.

టిటిడి కల్తీ నెయ్యి కేసులో బ్యాంకు వివరాలు అడుగుతున్నారు

- హైకోర్టుకు తెలిపిన వైవి సుబ్బారెడ్డి భార్య

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సిబిఐ ఆధ్వర్యాన సిట్ తనకు చెందిన హైదరాబాద్, శ్రీనగర్ కాలనీ యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్‌లోని ఖాతా, ఇతర వివరాలు కోరడాన్ని వైసిపి రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డి భార్య స్వర్ణలత హైకోర్టులో సవాల్ చేశారు. లంచ్‌మోషన్ పిటిషన్‌ను జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప శుక్రవారం విచారించారు. ఇప్పటికే యాక్సిస్ బ్యాంకు నుంచి పొందిన వివరాలతో సిబిఐ సిట్ దర్యాప్తు కొనసాగించవచ్చునని చెప్పారు. తిరిగి ఉత్తర్వులు ఇచ్చే వరకు యాక్సిస్ బ్యాంకు నుంచి ఇంకేమీ వివరాలు కోరరాదని సిబిఐ సిట్‌ను ఆదేశించారు. కౌంటర్ దాఖలు చేయాలన్నారు. విచారణను ఈ నెల 31కి వాయిదా వేశారు. కల్తీ నెయ్యి కేసులో పిటిషనర్ సాక్షి లేదా నిందితురాలు కాదని పిటిషనర్ న్యాయవాది వాదించారు. కాబట్టి పిటిషనర్ బ్యాంకు ఖాతాలు, స్టేట్‌మెంట్ల వివరాలను కోరడం చెల్లదన్నారు. సిబిఐ సిట్ తరపున న్యాయవాది పిఎస్‌పి సురేష్ కుమార్ స్పందిస్తూ, పిటిషనర్‌కు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులివ్వొద్దని వాదించారు. మధ్యంతర ఉత్తర్వులిస్తే దర్యాప్తునకు అవరోధం ఏర్పడుతుందన్నారు.

28న చేనేతల ధర్నాలు

- జయప్రదం చేయండి : సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా ఎడి కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమావేశం నిర్ణయించిందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు చేస్తామని చెప్పి ఇప్పటికి 14 నెలలు గడుస్తున్నప్పటికీ అమలు చేయలేదన్నారు. దీనితోపాటు చేనేత కార్మికులకు సంవత్సరానికి రూ.25 వేలు ఇస్తానని ప్రకటించినది వెంటనే అమలు చేయాలని కోరారు. సహకార సంఘాలకు, రావలసిన బకాయిలు రూ.203 కోట్లు ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులలో తీసుకున్న అప్పులు చెల్లించలేక, వడ్డీ చక్రవడ్డీలు చెల్లించవలసి వస్తోందన్నారు. చేనేత రక్షణకు 11 రకాల రిజర్వేషన్‌లు అమలు జరపాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేతపై జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలని, చేనేత కార్మికులకు సహకార సంఘాలలోలేని వారికి ఇవ్వవలసిన త్రిఫ్ట్ ఫండ్ రూ.27 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి 28వ తేదీన జరిగే ధర్నా కార్యక్రమాల్లో చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

టైర్‌పగిలి బస్సు దగ్ధం

- ప్రయాణికులు క్షేమం

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం జిల్లా పరిధిలోని గార్లదిన్నె వద్ద శుక్రవారం తెల్లవారుజామున టైర్ పగిలి ప్రయివేటు ట్రావెల్స్ బస్సు పూర్తిగా దగ్ధమయ్యింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. 29 మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి రాయచూరికి ప్రైవేట్ బస్సు వెళుతుండగా గార్లదిన్నె సమీపంలోని తలగాసిపల్లి క్రాస్ వద్ద టైర్ పగిలింది. దీంతో బస్సుకు మంటలు వ్యాపించాయి. వెంటనే బస్సులో ఉన్న వారందరూ కిందికి దిగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో బస్సు పూర్తిగా కాలిపోయింది. ఎస్ఐ మహ్మద్‌గౌస్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బంది సాయంతో మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మంత్రి లోకేష్ మాట నిలబెట్టుకోవాలి

మంగళగిరిలో ఇళ్ల స్థలాలకోసం బైఠాయింపు..భారీగా తరలివచ్చిన పేదలు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

ఎన్నికల సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, పేదలకు ఇళ్లస్థలాలివ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల కోసం సిపిఎం ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరిలోని కార్పొరేషన్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. వేలాది మంది పేదలు అర్జీలతో తరలివచ్చి కార్పొరేషన్ కార్యాలయం లోపల బైఠాయించారు. ధర్నాకు సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్‌లాల్ అధ్యక్షత వహించగా బాబూరావు మాట్లాడుతూ రాజధాని అమరావతిలో ప్రైవేట్ యూనివర్సిటీలకు వందలాది ఎకరాలను ధారాదత్తం చేస్తున్నా పేదలను మాత్రం విస్మరిస్తున్నారని వివరించారు. ఇంటి అద్దె చెల్లించలేక పేదలు నానా అగచాట్లు పడుతున్నారని తెలిపారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నియోజకవర్గంలోని నివాసం ఉంటున్నా ఇక్కడి పేదల గురించి వారికి పట్టడం లేదని, రాజధాని గ్రామాల్లోని పది ఊళ్లు ఎమ్‌టిఎంసి కార్పొరేషన్ పరిధిలో ఉన్నాయని, ఇక్కడున్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. ఇళ్ల స్థలం లేనివారు 20 వేల మంది, ప్రభుత్వ భూముల్లో ఉంటున్నా పట్టాలు లేనివారు మరో 20 వేల మంది ఉన్నారని, వారందరికీ పట్టాలు, ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలివ్వాలని, టిడ్కో గృహాలు వద్దని సొంత స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే మంగళగిరిలోని అనేక ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు, ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిల్లో ఎర్రజెండాలు పాతి భూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి, కార్యదర్శివర్గ సభ్యులు పి.రామారావు, ఇతర నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీంతోపాటు పేదలు తమ ఇళ్లస్థలం దరఖాస్తులను కార్పొరేషన్ సిబ్బందికి అందజేశారు.

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట దరఖాస్తులు పట్టుకుని బైటాయించిన పేదలు

జిఎస్‌టి వ్యాసరచన పోటీలో రాష్ట్ర విజేత గోపికృష్ణ

- అభినందించిన మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-మార్టూరు రూరల్ (బాపట్ల జిల్లా)

'జిఎస్‌టి సేవింగ్స్' అంశంపై జాతీయ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో బాపట్ల జిల్లా మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామానికి చెందిన శాతరాజు పవన్‌గోపికృష్ణ రాష్ట్రస్థాయి విజేతగా ఎంపికయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ శ్రీశైలం పర్యటనలో పవన్ గోపికృష్ణ ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలు తెరవాలి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, క్వింటాకు రూ.10,500 చొప్పున కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కర్నూలు, పల్నాడు, గుంటూరు, అనంతపురం, నంద్యాల తదితర జిల్లాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 12 లక్షల ఎకరాల్లో రైతులు పత్తిసాగు చేశారని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యధికంగా సాగుచేసిన కర్నూలు జిల్లాలో పత్తి దిగుబడులు ప్రారంభమై ఇప్పటికే నెలరోజులు గడుస్తుందని తెలిపారు. అయినా సిసిఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదన్నారు. దీంతో ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాకు రూ.8,110 మద్దతు ధర రైతులకు దక్కడం లేదన్నారు. పత్తి వ్యాపారులు రకరకాల కొర్రీలతో క్వింటాకు రూ.6 వేల నుంచి రూ.7 వేలకు మించి ధర ఇవ్వకుండా రైతులను దోచుకుంటున్నారని తెలిపారు. ఎకరాలకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, 5 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి కనిపించక రైతులు ఆందోళనలో ఉన్న సమయంలో సిసిఐ సాగతీత ధోరణితో తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. తక్షణమే సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమ, గొగ్గి పేరుతో రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఇచ్చేందుకు నిరాకరిస్తే రైతులు మరింత నష్టపోయే అవకాశం ఉందన్నారు.

ఉగ్రవాద సానుభూతిపరులు అరెస్టు

- ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ట్రాన్సిట్ వారంట్‌తో ధర్మవరానికి తరలింపు : ఎస్‌పి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఐఎస్ఐ ఆధారిత జైష్-ఎ-మొహమ్మద్ (జెఇఎం)కు చెందిన వారితో సంబంధాలను కొనసాగిస్తున్న ఇరువురిని ధర్మవరం పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలకు విలేకరులకు శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు...గతంలో జెఇఎంకు చెందిన వాట్సాప్ గ్రూప్‌లో సభ్యుడిగా ఉన్న ధర్మవరానికి చెందిన కోత్వాల్ నూర్ మొహమ్మద్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారు. ఈ సందర్భంగా మరో ఇద్దరు సభ్యుల గురించి నిందితుడు చెప్పారు. దీంతో ఉత్తరప్రదేశ్ పోలీసుల సహకారంతో అమ్రోహాలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి సాజాద్ హుస్సెన్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, జిహాదీ మెటీరియల్, సింగిల్ బ్యారెల్ రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర ఎటిఎస్ బృందాల సహకారంతో తౌఫీక్ ఆలమ్ షేక్‌ను నాసిక్‌లోని మలేగావులో అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలు, జిహాదీ మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇద్దరిని స్థానిక న్యాయస్థానాల్లో హాజరు పరిచిన అనంతరం ట్రాన్సిట్ వారంట్స్‌తో ధర్మవరానికి తీసుకువచ్చినట్లు ఎస్‌పి తెలిపారు. ఈ ఇద్దరు ఉగ్రవాదులు జైష్-ఎ ఆధారిత వాట్సాప్ గ్రూప్‌లు, ఛానల్స్‌లలో క్రియాశీలక సభ్యులుగా ఉన్నారని, వీరు జెఇఎం ఆపరేటర్లతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండి పాకిస్తాన్‌లో మిలటరీ శిక్షణ తీసుకొని భారతదేశంపై యుద్ధం చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. త్వరలో జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపనున్నట్లు చెప్పారు.

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి సతీష్‌కుమార్

రేపు జనవరి దర్శన కోటా విడుదల

ప్రజాశక్తి - తిరుమల, తిరుపతి బ్యూరో

2026 జనవరి నెలకు సంబంధించి టిటిడి విడుదల చేసే వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలను టిటిడి ఒక ప్రకటనలో పేర్కొంది. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు, అంగ ప్రదక్షిణ టోకెన్ల జనవరి కోటాను అక్టోబర్ 19న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం అక్టోబర్ 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపింది. 23న ఆర్జిత సేవా టికెట్లను విడుదల చేయనున్నట్లు, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ టికెట్లను 23న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపింది. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 11 గంటలకు విడుదల చేయనుంది. వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపింది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 25న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్లు, తిరుమల, తిరుపతిలో గదుల కోటాను 25న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు పేర్కొంది.

శ్రీవారి లడ్డూ ప్రసాదాల ధరలను పెంచట్లేదు : టిటిడి చైర్మన్

తిరుమల తిరుపతి దేవస్థానం, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకే కొందరు శ్రీవారి లడ్డూ ప్రసాదాల ధరలను పెంచుతున్నట్లు అవాస్తవ ప్రచారాలు చేస్తున్నారని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు విమర్శించారు. టిటిడి లడ్డూ ప్రసాదాల ధరలను పెంచే ఆలోచనేలేదని ఆయన స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు వార్తలను ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు పలుప్రాంతాల్లో వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో శనివారం నాడు పలు ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. వీటితోపాటు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కృష్ణా, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని ఆ సంస్థ తెలిపింది.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులు మృతి

- గురుకుల విద్యార్థినులకు బొత్స పరామర్శ
- మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు చొప్పున ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా)

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గిరిజన గురుకుల విద్యార్థులు పచ్చకామెర్ల వ్యాధి బారిన పడి మృతి చెందారని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. రాష్ట్రంలో కనీస మానవత్వంలేని ప్రభుత్వం కొనసాగుతోందని దుయ్యబట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థులను శుక్రవారం జడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సిఎంలు రాజన్నదొర, పుష్పశ్రీవాణిలతో కలిసి ఆయన పరామర్శించారు. అంతకుముందు కురుపాం మండలంలోని దండుసూరిలో మృతి చెందిన విద్యార్థులు తోయక అంజలి, తోయక కల్పన కుటుంబ సభ్యులకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైసిపి తరఫున ఒక్కొక్క కుటుంబానికి రూ.ఐదు లక్షలు ప్రకటించిన నేపథ్యంలో మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి ఆధ్వర్యంలో బొత్స చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్య, వైద్యానికి తూట్లు పొడుస్తూ వారి వ్యక్తిగత అభివృద్ధిని చూసుకుంటున్నారే తప్ప, చేసిందేమీలేదని విమర్శించారు. కనీసం విద్యార్థులకు రక్షిత మంచినీరు సక్రమంగా అందించలేకపోతున్నారన్నారు. గిరిజన శాఖ మంత్రిగానీ, విద్యాశాఖ మంత్రిగానీ విద్యార్థుల కుటుంబాలను పరామర్శించాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. విశాఖపట్నం కెజి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు పూర్తిగా కోలుకోకముందే పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి పంపించడం సరైన విధానం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం ఆ పని చేయకపోతే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పరిహారం చెల్లిస్తామని బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు జోగారావు, కళావతి, శంబంగి చిన్నప్పలనాయుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొన్నారు.

పార్వతీపురం ఏరియా ఆస్పత్రిలో విద్యార్థులను పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

విదేశీ మారకం నిల్వల్లో పతనం

- వారంలో 2.18 బిలియన్ డాలర్ల తగ్గుదల
- ఆర్‌బిఐ వెల్లడి

న్యూఢిల్లీ : భారతదేశ విదేశీ మారకం నిల్వల్లో మరోమారు తగ్గుదల చోటు చేసుకుంది. అక్టోబర్ 10తో ముగిసిన వారంలో 2.18 బిలియన్ డాలర్లు తగ్గి 697.78 బిలియన్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తెలిపింది. ఇది ఇంతక్రితం వారం అక్టోబర్ 3న నమోదైన 699.96 బిలియన్లతో పోల్చితే తగ్గుదలను సూచిస్తుందని పేర్కొంది. ఫారెక్స్ నిల్వలలో ప్రధాన భాగం అయినా విదేశీ కరెన్సీ ఆస్తులు సమీక్షా వారంలో 5.61 బిలియన్ డాలర్లు తగ్గి 572.10 బిలియన్లకు పరిమితమయినట్లు ఆర్‌బిఐ తెలిపింది. ఈ ఆస్తులలో యూరో, యెన్, పౌండ్ వంటి కరెన్సీలు డాలర్‌తో పోలిస్తే విలువలో హెచ్చు తగ్గులు చెందడం ఈ తగ్గుదలకు కారణం. ఇటీవల డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడంతో ఈ విలువ తగ్గింది. అదే సమయంలో బంగారం నిల్వలు 3.60 బిలియన్లు పెరిగి 102.37 బిలియన్లకు చేరాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డిఆర్) 18.68 బిలియన్ డాలర్లకు తగ్గాయని వెల్లడించింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లో భారతదేశ నిల్వలు 36 మిలియన్ డాలర్లు తగ్గి 4.63 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి.

తగ్గిన యూకో బ్యాంక్ ఎన్‌పిఎలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో యూకో బ్యాంక్ నికర లాభాలు 2.82 శాతం పెరిగి రూ.620 కోట్లుగా నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.603 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.2,301 కోట్లుగా ఉన్న నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) గడిచిన క్యూ2లో 10.08 శాతం పెరిగి రూ.2,533 కోట్లకు చేరింది. యూకో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.56 శాతానికి తగ్గాయి. 2024 ఇదే సెప్టెంబర్ నాటికి జిఎన్‌పిఎ 3.18 శాతంగా ఉంది. నికర నిరర్థక ఆస్తులు 0.73 శాతం నుంచి 0.43 శాతానికి దిగివచ్చాయి.

రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు రూ.22,092 కోట్ల లాభాలు

- క్యూ2లో రూ.2.59 లక్షల కోట్ల రెవెన్యూ

న్యూఢిల్లీ : ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లాభాలు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 14 శాతం వృద్ధితో రూ.22,092 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.19,323 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.2.35 లక్షల కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ2లో రూ.2.59 లక్షల కోట్లకు పెరిగింది. రిలయన్స్ అప్పులు 1 శాతం పెరిగి రూ.1.19 లక్షల కోట్లకు చేరాయి.

గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో రిలయన్స్ జియో రెవెన్యూ 4 శాతం పెరిగి రూ.36,332 కోట్లుగా నమోదయ్యింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.35,032 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. ఇదే సమయంలో రూ.7,110 కోట్లుగా ఉన్న లాభాలు.. గడిచిన క్యూ2లో 4 శాతం పెరిగి రూ.7,379 కోట్లకు పెరిగింది.

'గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయిల్, జియో, రిటైల్ వ్యాపారాల నుంచి బలమైన సహకారంతో మెరుగైన పనితీరును కనబర్చాము. ఏకీకృత లాభాలు 14.6 శాతం పెరిగాయి. ఇది చురుకైన వ్యాపార కార్యకలాపాలకు నిదర్శనం. భారత ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక వృద్ధిని ప్రతిబింబిస్తుంది." అని రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేష్ అంబానీ పేర్కొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల కస్టడీలో నకిలీ మద్యం నిందితులు

విచారిస్తున్న అసిస్టెంట్ కమిషనర్, సిట్ అధికారి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్(అన్నమయ్య జిల్లా)

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ములకలచెరువు నకిలీ మద్యం కేసు దర్యాప్తును ఎక్సైజ్ పోలీసులు వేగవంతం చేశారు. ఈ కేసులో మూలాలను కనుక్కొని పెద్ద తలకాయిని పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు ఇప్పటికే అరెస్టై జైల్లో ఉన్న పది మంది నిందితులను కస్టడీకి కోరుతూ కోర్టుకు విన్నవించారు. కోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక సబ్‌జైల్లో ఉన్న పదిమంది నిందితులు సయ్యద్ హాజీ, కుక్కల బాలరాజు, గణేషన్ మనిమారన్, అనంతన్ శ్రీనివాసన్, సూరియా వెంగదేశన్, వెంకటేషన్ సురేష్, మిథున్ దాస్, అంతదాస్, కట్టా సురేంద్రనాయుడు, నాగరాజుకు వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం బెంగళూరు రోడ్డులోని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి కస్టడీలోకి తీసుకున్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ బృందానికి చెందిన విజయవాడ నుంచి వచ్చిన అధికారి, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర విచారణ చేస్తున్నారు. పది మంది నిందితులను వారు ప్రశ్నిస్తున్నారు. శనివారం కూడా వారిని విచారించనున్నారు.

3న నకిలీ మద్యం గుట్టురట్టు

ములకలచెరువు కేంద్రంగా పెద్ద ఎత్తున నకిలీ మద్యం తయారు చేస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ద్వారా తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు ఈ నెల 3న దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.1.75 కోట్లు విలువ చేసే నకిలీ మద్యాన్ని సీజ్ చేసి, మద్యం తయారీలో ఉన్న పదిమందిని అరెస్ట్ చేశారు. విచారణలో భాగంగా నకిలీ మద్యం తయారీలో ప్రధాన నిందితుడు జనార్ధన్‌రావుతో పాటు కేసులో ప్రమేయం ఉన్న మరో 23 మందిపై కేసులు నమోదు చేశారు. మొదటి రోజు పది మందిని అరెస్టు చేసిన పోలీసులు అనంతరం ఈ కేసులో ప్రమేయం ఉన్న ప్రధాన నిందితుడు జనార్ధన్‌రావును విజయవాడలో అరెస్టు చేశారు. తంబళ్లపల్లి టిడిపి మాజీ ఇన్‌ఛార్జి దాసరపల్లి జయచంద్రారెడ్డి కనుసన్నల్లోనే ఇదంతా జరిగిందని భావించిన పార్టీ అధిష్టానం ఆయనను సస్పెండ్ చేసింది. ఆయనతో పాటు మరో ప్రధాన నిందితుడు కట్ట సురేంద్రనాయుడిని సస్పెండ్ చేసింది. ఇప్పటివరకు 15 మంది అరెస్టు కాగా, మరో ఎనిమిది మంది అరెస్టు కావాల్సి ఉంది. వీరిలో జయచంద్రారెడ్డి, ఆయన పిఎ రాజేష్, తదితరులు ఉన్నారు. నిందితులను రెండు రోజుల పాటు కస్టడీకి కోరిన ఎక్సైజ్ పోలీసులు, మొదటి రోజు శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు విచారణ చేసి తిరిగి సబ్ జైలుకు తరలించారు.

నిందితులను కస్టడీకి తీసుకుంటున్న ఎక్సైజ్ పోలీసులు

విద్యార్థులకు ప్రతి వారమూ ఆరోగ్య పరీక్షలు

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసి సంక్షేమ వసతి గృహాలు, ఎంజెపి పాఠశాలల విద్యార్థులకు ప్రతి వారమూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత ఆదేశించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అమరావతిలోని సచివాలయం నుంచి వసతి గృహ వార్డెన్‌లు, ఎంజెపి స్కూళ్ల ప్రిన్సిపల్స్‌తో వీడియోకాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిబిసిడబ్ల్యుఒలు, ఎబిసిడబ్ల్యుఒలు ప్రతిరోజూ వసతి గృహాలను సందర్శించాలని సూచించారు. వసతి గృహాల్లో పారిశుధ్యంపై తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని, తాజా ఆహారం మాత్రమే అందించాలని సూచించారు. మురుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. వార్డెన్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. ఈ ఏడాది పది, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని, ఇందుకోసం ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుని అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఎంజెపి కార్యదర్శి మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రెడ్డీస్‌లో 10 శాతం దాటిన ఎల్ఐసి వాటా

న్యూఢిల్లీ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ డాక్టర్ రెడ్డీస్‌లో ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసి ఇటీవల 1.71 కోట్లకు పైగా షేర్లను సొంతం చేసుకుంది. దీంతో డాక్టర్ రెడ్డీస్‌లో దేశంలోని అతిపెద్ద సంస్థాగత పెట్టుబడిదారుల్లో ఒకటైన ఎల్ఐసి ఎల్ఐసి వాటా 10 శాతం దాటింది.

ఈ ఏడాది జూన్ 8.21 శాతంగా ఉన్న వాటాను అక్టోబర్ 15 నాటికి 10.26 శాతానికి చేరిందని గురువారం రెడ్డీస్ తన ఫైలింగ్‌లో వెల్లడించింది. తాజాగా తమ సంస్థలో ఎల్ఐసి 1,71,40,819 షేర్లను సొంతం చేసుకుందని.. ఇది అదనంగా 2 శాతం వాటాకు సమానమని వెల్లడించింది.

ఎంఇఐఎల్‌కు కువైట్ కంపెనీ భారీ ఆర్డర్

- దాదాపు రూ.1984 కోట్ల కాంట్రాక్టు
- కెఒసికి గ్యాస్ స్వీటెనింగ్ ప్లాంట్ నిర్మాణం

ప్రజాశక్తి - హైదరాబాద్

కువైట్ ఆయిల్ కంపెనీ (కెఒసి) నుంచి భారీ ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) వెల్లడించింది. కెఒసి నుంచి ఏకంగా 225.5 మిలియన్ అమెరికన్ డాలర్ల (దాదాపు రూ.1984 కోట్లు) విలువైన ఈ ప్రాజెక్ట్ ఆర్డర్‌తో మరో అంతర్జాతీయ మైలురాయిని అధిగమించామని ఆ సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. కెఒసి బూస్టర్ స్టేషన్ బిఎస్ 171 సమీపంలో ఈ ప్లాంట్ ను 790 రోజుల్లో ఎంఇఐఎల్ నిర్మించి ఆ తరువాత ఐదు సంవత్సరాల పాటు నిర్వహించడానికి ఒప్పందం కుదుర్చుకుంది. బిల్డ్ ఓన్ ఆపరేట్ పద్ధతిలో వెస్ట్ కువైట్ ఆయిల్‌ఫీల్డ్స్‌లో కొత్త గ్యాస్ స్వీటెనింగ్, సల్ఫర్ రికవరీ ఫెసిలిటీ (ఎన్‌జిఎస్ఎఫ్) రూపకల్పన, నిర్మాణ, నిర్వహణ, సంరక్షణ బాధ్యతలను ఎంఇఐఎల్ చేపట్టనుంది. ఎస్ఆర్‌యులో నాలుగు శాతం హైడ్రోజన్ సల్ఫైడ్, 10 శాతం వరకు కార్బన్ డైఆక్సైడ్ ఉన్న 120 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ ఫీట్ల (ఎంఎంఎస్‌సిఎఫ్‌డి) సౌర గ్యాస్‌ను శుద్ధి చేసే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంఇఐఎల్ ఏర్పాటు చేయనుంది. సహజ వాయువులోని తేమను తొలగించి, పర్యావరణానుకూలమైన, శుభ్రమైన, వినియోగానికి సురక్షితమైనదిగా మార్చే గ్యాస్ స్వీటెనింగ్ ప్రక్రియను నిర్మించనుంది. "పశ్చిమ కువైట్‌లోని ఈ వ్యూహాత్మక గ్యాస్ స్వీటెనింగ్ ఫెసిలిటీ నిర్మాణంలో భాగస్వామ్యం అవ్వడం మాకు గర్వకారణం. ఈ ప్రాజెక్ట్ మా సంస్థ పర్యావరణ భద్రత, సాంకేతిక నాణ్యత, ఆపరేషనల్ సామర్థ్యానికి ప్రతిబింబం. ప్రపంచస్థాయి ఇంధన మౌలిక సదుపాయాలను అందించడంలో మా సమర్థతను ఇది మరింత బలోపేతం చేస్తుంది" అని ఎంఇఐఎల్ డైరెక్టర్ పి దొరయ్య పేర్కొన్నారు.

సంపాదకీయం

అదే వంచన!

ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రంలో తాజాగా పర్యటించినా ఎటువంటి మేలు చేయకుండా ఆ వంచన బాటనే కొనసాగించడం దారుణం. రూ.13,400 కోట్ల పేరుతో ప్రారంభించిన 16 ప్రాజెక్టుల్లో కర్నూలు జిల్లాకు, రాయలసీమకు చెందినవి స్వల్పమే! ఇతర రాష్ట్రాల ప్రాజెక్టులను ఇక్కడ నుండి ప్రారంభించి ఈ రాష్ట్రానికి ఇచ్చినట్లు ప్రచారం చేయడం మోడీ సర్కారుకే చెల్లింది. రాష్ట్ర విభజన సందర్భంగా కర్నూలు జిల్లా పంచలింగాల వద్ద రైల్వేవ్యాగన్ వర్క్‌షాపు, ఆదోని వద్ద టెక్స్‌టైల్ పార్కు, కడపలో స్టీలుప్లాంటు ఏర్పాటు చేస్తామని చెప్పిన వాటికి అతీగతి లేదు. గతంలో టిడిపిని విమర్శించి, రాయలసీమ డిక్లరేషన్ పేరుతో రూ.20 వేల కోట్లు స్పెషల్ ప్యాకేజీని డిమాండ్ చేసిన బిజెపి ఇప్పుడా ఊసే ఎత్తుకోవడం లేదు. డబుల్ ఇంజన్ సర్కారు అని చెబుతూ బిజెపి నాయకులెవరూ దీని గురించి మాట్లాడటమే లేదు. బిజెపి అధికారంలోకి ఉండీ వారు ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్ అమలు చేయకపోవడంపై ప్రజలకు సంజాయిషీ చెప్పుకోవలసిందిపోయి మౌనం దాల్చడం వారికే చెల్లింది. తిరుపతి వెంకన్న సాక్షిగా 2014 ఎన్నికల సభలో నరేంద్ర మోడీ చెప్పిన ప్రత్యేక హోదా, విభజన హామీలను అధికారానికొచ్చాక గాలికొదిలేశారు. ఢిల్లీని తలదన్నేలాంటి రాజధాని నిర్మిస్తామని ఆనాడు గొప్పలు చెప్పగా ఇప్పుడు కర్నూలు సభలో 'ఢిల్లీ, అమరావతి కలిసి అభివృద్ధి వైపు నడుస్తున్నాయ'ని ప్రధానమంత్రి ఉద్ఘాటించడం కూడా అలాంటిదే! నాటి మాటలకు వెంకన్న మౌన సాక్షి కాగా ఇప్పుడు శ్రీశైల మల్లన్న వంతయింది. దేవుళ్ల సంగతి ఎలా వున్నా అప్పటి నుండి ఇప్పటికీ మోసపోతున్నది మాత్రం తెలుగు ప్రజలే!

సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ అంటూ పాలకులు ఊదర గొడుతున్నారు కానీ నిజంగా జరిగే సేవింగ్స్ ఏడాదికి తలసరి రూ.1600 మాత్రమేనని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. మరి పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో పోల్చితే ఇది ఏపాటిది? కార్లు, ఎయిర్ కండిషనర్లు, భారీ స్క్రీన్ టీవీల వంటివాటికి తగ్గిందేతప్ప బియ్యం, ఉప్పు, పప్పుల జిఎస్‌టి తేడా లేదన్న సంగతి అందరికీ తెలిసిందే! ప్రధాని మాట్లాడుతూ వికసిత భారత్‌కు స్వర్ణాంధ్రప్రదేశ్ మరింత తోడ్పడనుందని, డబుల్ ఇంజన్ సర్కార్‌లో ఎ.పి సామర్థ్యాన్ని మరింత పెంచబోతున్నామని తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాకారమవుతుందన్నారు. చంద్రబాబు విజన్‌ను ప్రశంసించారు. చంద్రబాబు నేతృత్వంలో ఆత్మ నిర్భర భారత్‌లో రాష్ట్రం ఒక కొత్త శక్తిగా మారుతుందని పేర్కొన్నారు. ఇంకేముంది...రాష్ట్రానికి మోడీ సహాయం మరువలేనిదని, అమరావతిని నిలబెట్టామని, పోలవరాన్ని గాడిన పెట్టామని, విశాఖ ఉక్కును నిలబెట్టామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకటే పొగడ్తలు... ఎనిమిదేళ్లపాటు వీరబాదుడు బాదినా ఇప్పుడు జిఎస్‌టి సంస్కరణలు తీసుకొచ్చినందుకు మోడీకి ధన్యవాదాలు చెప్పేశారు. ఆపైన డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కూడా మోడీని పొగడ్తలతో ముంచెత్తారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆయనతో పోటీ పడేలా రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ నడుస్తోందన్నారు. సభ పరస్పర పొగడ్తలతోనే సాగిపోయింది. ఇదే సభలో కరెంటు షాక్‌తో అర్జున్ అనే యువకుడు మరణిస్తే అధికార కూటమి వారి కుటుంబాన్ని పట్టించుకోలేదు. ఒక రోజు గడిచాక అరకొర ఆర్థిక సహాయం ప్రకటించారు. పైగా ప్రధాని పర్యటన సందర్భంగా సిపిఎం, ఇతర వామపక్ష నాయకులను పెద్ద సంఖ్యలో గృహ నిర్బంధం చేశారు. సుగాలి ప్రీతి తల్లిని నిర్బంధించారు. ఆదోనిలో విద్యార్థి నాయకులను సైతం అరెస్టు చేయడం అక్రమం. ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడల్లా వందల కోట్ల ప్రజాధనం వ్యయమవుతున్నదే తప్ప రాష్ట్రానికి ఎటువంటి మేలూ చేకూరడం లేదు. గత పదకొండేళ్లుగా సాగిస్తున్న వంచన బాటనే కమలనాథులు ఎల్ల కాలమూ కొనసాగిస్తే ప్రజలు సహించరు. ప్రజలు తమ అనుభవంలో తెలుసుకొని బిజెపి మోసపూరిత విధానాలను తిప్పి కొడతారు. ఇప్పటికైనా ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు మోడీ సర్కారు చర్యలు చేపట్టాలి. అందుకోసం కేంద్రంపై ఒత్తిడి తేకుండా పొగడ్తల వర్షం కురిపిస్తూ పోతే టిడిపి, జనసేనలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారు.

మంచి మాట



సాంకేతిక విద్య కేవలం సమాచారం ఇచ్చేదిగానో, కొన్ని సాంకేతికాంశాలను నేర్పేదిగానో కాకుండా... విద్య గరిపేదిగా వున్నంతకాలం... అది కూడా ఒక పిల్లవాడు ఒక మనిషిగా ఎదిగేందుకు తోడ్పడుతుంది.

- ఆంటోనియో గ్రాంసీ,
ఇటాలియన్ మార్క్సిస్టు తత్వవేత్త.

Antonio Gramsci

పరువు పోగొట్టుకున్న ఇ.సి.ఐ

వ్యాఖ్య

బీహార్‌లో భారత ఎన్నికల సంఘం (ఇ.సి.ఐ) ప్రారంభించిన ప్రత్యేక సమగ్ర పరిశీలన (సర్)ను సందర్భాన్నిబట్టి చూస్తే విపత్కర ప్రభావాలు చూపబోతుందని చెప్పడం దిగ్భ్రాంతి కలిగించవచ్చు. అయితే ఇప్పుడు ఆ ప్రభావాలేమిటో బహిర్గతమవుతున్న పరిస్థితి. జూన్ 25న ఈ ప్రక్రియను ప్రారంభించన కొద్ది రోజుల్లోనే దాని అసలు లక్ష్యం ఓటర్ల జాబితాల ప్రక్షాళనను మించి ఇంకా చాలా వుండబోతోందని స్పష్టమైంది.

ఆ కసరత్తులో మూడు ప్రత్యేక లక్షణాలు కొట్టొచ్చినట్టు కనిపించాయి. మొదటిది ఈ ప్రక్రియలో అతను లేక ఆమె ఓటర్ల జాబితాలో తన పేరు వుంచాలంటే పౌరులు నిరూపణకు తమ ఆధారాలను తామే సమకూర్చుకునే బాధ్యత తీసుకోవాలి. గతంలోనైతే ఓటర్ల జాబితాల పున:పరిశీలన బాధ్యత ఇ.సి.ఐ నియమించిన ఎన్యూమరేటర్లు నిర్వహించేవారు. కానీ ప్రస్తుత సందర్భంలోనైతే ఇప్పుడున్న లేక కాబోతున్న ఓటర్లు ఒక ఫారం సమర్పించడమే గాక ఇ.సి.ఐ నిర్దేశించిన 11 పత్రాలలో ఏదో ఒకటి చూపించాల్సి వుంటుంది. అధికార పత్రాల అందుబాటు స్థాయి చాలా తక్కువలోనే వుండే నేపథ్యంలో ఈ ప్రక్రియ పున:పరిశీలనకు గాక తొలగింపునకూ, తీసివేతకూ ఉద్దేశించబడిందని తేలిపోయింది. రాజ్యాంగం, తర్వాత వరుసగా అనేక సుప్రీంకోర్టు తీర్పులు గుర్తించిన సార్వత్రిక ఓటు హక్కు అనే సూత్రానికి తిలోదకాలు ఇస్తున్నట్టు అర్థమైంది.

మరిన్ని కీలక ప్రశ్నలు

రెండవ ప్రశ్న ఇ.సి.ఐ ఓటరు పౌరసత్వాన్ని నిర్ధారించే హక్కు బలవంతాన లాక్కుంటున్నదా? రాజ్యాంగం 326వ అధికరణం ప్రకారం ఓటరు హక్కుకు సంబంధించి పౌరసత్వంపై యథాలాపంగా చేసిన ప్రస్తావన ఆధారంగా ఈ వాదన తీసుకురాబడింది. పౌరసత్వం వుండాలనే ముందస్తు షరతుకు మినహాయింపు లేదు గానీ దాన్ని నిర్ధారించే బాధ్యత మాత్రం ఇ.సి.ఐ ది కాదు. ఈ విషయంలో హోంమంత్రిత్వ శాఖకు బాధ్యత అప్పగించబడింది. ఏమైనా 'సర్' తతంగం ఈ అవసరాన్ని తెలిగ్గా ఏకపక్షంగా తోసిపారేసింది. ఇక చివరగా కాలవ్యవధి. పెద్ద సంఖ్యలో వలస కార్మికులు జీవనోపాధి కోసం రాష్ట్రం వదలివెళ్లే బీహార్ వంటి రాష్ట్రంలో ఇచ్చిన ఈ కాలవ్యవధి చాలా స్వల్పం. అనేక ప్రాంతాల్లో వరద పరిస్థితుల వంటివి వుండగా వర్షాకాలంలో ఈ కసరత్తుకు అతి స్వల్ప వ్యవధి మాత్రమే లభించింది. బూత్ స్థాయి అధికారులు (బి.ఎల్.ఓ)లకు శిక్షణ లేని పరిస్థితులలో ఇంత నిశితమైన ప్రక్రియ పూర్తి కావడం నిజంగానే అసంభవం.



> బీహార్ శాసనసభ ఎన్నికల్లో బిజెపి కి మేలు చేసేందుకే ఈ తతంగం ఉద్దేశించబడిందని మొదటి నుంచి స్పష్టమవుతూనే వుంది. ఎందుకంటే గతంలో ఈ ఎన్నికలు హోరాహోరీగా, పోటాపోటీగా జరిగాయి. ఇసిఐ తలపెట్టిన 'సర్'ను బలపర్చేందుకు రంగంలోకి దిగింది బిజెపి మాత్రమే. సహజంగానే ప్రతిపక్షాలు, ఆందోళన చెందిన పౌరులు గట్టిగా ఎదిరించేందుకు ముందుకొచ్చారు. దీన్ని చక్కదిద్దేందుకు రాజ్యాంగం ఇచ్చిన ప్రతి వేదికనూ వాడుకోవడానికి ప్రయత్నించారు. రాజకీయ పార్టీలూ పౌరసంఘాలు దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్లు ఇప్పటికీ సుప్రీం కోర్టు విచారణలోనే వున్నాయి. అత్యున్నత న్యాయస్థానం ఇ.సి.ఐ ఆధార్ కార్డు అనే 12వ పత్రాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని పరిమిత మధ్యంతర ఉత్తర్వు ఇచ్చినప్పటికీ విస్తారమైన సమస్యలు మిగిలే వున్నాయి. ఓటర్ల సంఖ్య భారీ ఎత్తున తగ్గిపోయింది.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

కనుకనే ఈ విషయంలో వచ్చిన తుది ఫలితం ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించేదిగా లేదు. 81 లక్షల మందికి పైగా ఓటర్లు తుది జాబితాలో పేరు పొందలేకపోయారు. 1.38 కోట్ల మంది ఓటర్ల చిరునామాలు అనుమానాస్పదంగా వున్నాయన్నారు. తొమ్మిది లక్షల మందికి పైగా మహిళా ఓటర్లు తమ ఓటు హక్కు కోల్పోయారు. 14 లక్షల మందికి పైగా ఓటర్లకు ఒకటికి మించిన ఎపిక్ కార్డులున్నట్టు తేలింది. 100 మందికి పైగా ఓటర్లు వున్న ఆవాసాలు 2258 వున్నాయి. కనుక ఇది పారదర్శకంగా జరిగిందనడానికి ఎలాంటి ఆధారం లేదు. ఫిర్యాదులు లేని స్వచ్ఛమైన జాబితా ఎంతమాత్రం కాదు ఇది, తుది ఓటర్ల జాబితాలు తీవ్ర సందేహాలకు నిలయంగా మారాయి.

బీహార్ శాసనసభ ఎన్నికల్లో బిజెపి కి మేలు చేసేందుకే ఈ తతంగం ఉద్దేశించబడిందని మొదటి నుంచి స్పష్టమవుతూనే వుంది. ఎందుకంటే గతంలో ఈ ఎన్నికలు హోరాహోరీగా, పోటాపోటీగా జరిగాయి. ఇసిఐ తలపెట్టిన 'సర్'ను బలపర్చేందుకు రంగంలోకి దిగింది బిజెపి మాత్రమే. సహజంగానే ప్రతిపక్షాలు, ఆందోళన చెందిన పౌరులు గట్టిగా ఎదిరించేందుకు ముందుకొచ్చారు. దీన్ని చక్కదిద్దేందుకు రాజ్యాంగం ఇచ్చిన ప్రతి వేదికనూ వాడుకోవడానికి ప్రయత్నించారు. రాజకీయ పార్టీలూ పౌరసంఘాలు దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్లు ఇప్పటికీ సుప్రీం కోర్టు విచారణలోనే వున్నాయి. అత్యున్నత న్యాయస్థానం ఇ.సి.ఐ ఆధార్ కార్డు అనే 12వ పత్రాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని పరిమిత మధ్యంతర ఉత్తర్వు ఇచ్చినప్పటికీ విస్తారమైన సమస్యలు మిగిలే వున్నాయి. ఓటర్ల సంఖ్య భారీ ఎత్తున తగ్గిపోయింది.

సమస్యలు సశేషమే

ఇ.సి.ఐ ప్రయత్నమంతా మోసపూరితంగా వుందనేది ఇప్పుడు కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. 2025 బీహార్ ఎన్నికలలో 'సర్' ప్రక్రియ చేపట్టడం అంటే...2003లో జరిగిందే మరోసారి జరుగుతున్నది తప్ప ఎంతమాత్రం అసాధారణం కాదని, ఇ.సి.ఐ ముందు నుంచీ వాదిస్తూ వచ్చింది. అయితే అప్పటి మార్గదర్శకాలను వెల్లడించాలని కోరగా ఎన్నికల సంఘం అందించలేదు. ఇందుకు సంబంధించి నాటి అధికార పత్రాలు అందుబాటులో లేవన్నది అపరిపక్వతను బయట పెట్టుకోవడమే గాక వ్యవస్థాగతమైన అసమర్థతను కూడా వెల్లడించుకుంది.

అయితే వారు పచ్చి అబద్ధాలకు పాల్పడ్డారనేది ఇప్పుడు తేటతెల్లమైపోయింది. ప్రజాస్వామ్య సంస్కరణల వేదిక (ఎ.డి.ఆర్) సుప్రీం కోర్టుకు నాటి ఈ పత్రాలను సమర్పించడాన్ని బట్టి ఇది అబద్ధమని తేలింది. 2003 ఆదేశాలు వేల పేజీలున్నాయి. ఈ కసరత్తు చేపట్టే తరుణంలో మూడు కోణాలలోనూ ఇ.సి.ఐ ఎలాంటి మోసానికి పాల్పడిందో ఇప్పుడు సంపూర్ణంగా తెలిసిపోయింది.

పచ్చి అబద్ధాలు

ఇంకా ఏమైనా గజిబిజి అంటూ వుండి వుంటే నరేంద్ర మోడీ దళపతి అయిన హోంమంత్రి అమిత్ షా దాన్నీ లేకుండా చేశారు. పౌరులు కాని వారిని గుర్తించి తొలగించి పంపించేయడానికే 'సర్' ద్వారా ప్రయత్నం జరిగిందని ఆయన చెప్పేశారు. ఈ వాదనను సమర్థించుకోవడం కోసం ఆయన దేశ ముస్లిం జనాభాలో సాపేక్షంగా వచ్చిన స్వల్ప పెరుగుదలను నొక్కి చెప్పారు. ఈ పెరుగుదలకు కారణం సంతానోత్పత్తి రేటు పెరగడం గాక పెద్ద ఎత్తున జరిగిన చొరబాట్లేనని ఆయన మరీమరీ చెప్పారు. దేశంలో ముస్లిం జనాభా 24.6 శాతం చొప్పున పెరిగితే హిందూ జనాభా 4.5 శాతం చొప్పున తగ్గిపోతూ వస్తోందని ఆయన లెక్కలు చెప్పారు. ఈ వాదన ఆధారంగానే ఆయన పార్టీ, ప్రభుత్వం చొరబాటుదార్లను గుర్తిస్తానంటున్నది. ఓటర్ల జాబితా నుంచి వారి పేర్లు తొలగించడానికి చేయవలసింది మొత్తం చేస్తుంది. ఉత్తరోత్తరా వారిని స్వదేశాలకు పంపించేస్తుంది అన్నారు.

'సర్' నేపథ్యమేమిటో ఆయన స్పష్టంగానే ఏకరువు పెట్టారు. అయితే పహల్గాంలో ఉగ్రవాదులను పట్టుకోవడంలో విఫలమైనట్టే ఆయన మంత్రివర్గం చొరబాటుదారులను స్పష్టంగా ఎత్తిచూపడంలోనూ ఘోరంగా విఫలమైంది. ఆ విధంగా విఫలం అయిన కారణంగా ఆయన ఇప్పుడు ఇసిఐ భుజాల మీద తుపాకి పెట్టి కాల్చాలని ప్రయత్నిస్తున్నారు. భారీ సంఖ్యలో న్యాయమైన భారతీయ ఓటర్ల పేర్లు తొలగించబడినా సరే 'సర్'ను ఎవరూ ఏ మాత్రం వ్యతిరేకించరాదని ఆయన చాలా మొండిగా కరుగ్గా చెబుతున్నారు.

భారత దేశంలో జనాభా తీరుతెన్నుల గురించి 'ప్యూ' అధ్యయన కేంద్రం వెలువరించిన నివేదిక మతాల వారీ జనాభా వివరాలను పొందుపర్చింది. భారత దేశంలో మొత్తంగా జననాల రేటు తగ్గడమే కాదు. 2015లో ఈ తగ్గుదల దాదాపు అభివృద్ధి చెందిన సంపన్న దేశాలతో సమానంగా వుంది. ఇక భారతీయ ముస్లింలలోనూ జననాల రేటు ఒక మహిళకు 4.4 వుంటే ఇప్పుడు 2.6కు తగ్గిపోయింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే డేటా ఆధారంగా చెబుతున్న లెక్కలివి.

అసలైన విషాదం

మరి చొరబాటుదారులు భారత దేశాన్ని హస్తగతం చేసేసుకుంటున్నారన్న కల్పిత కథ కాస్తయినా నిజం కాదని అమిత్ షాకు చెప్పే వారెవరు? ఆయన ఉద్దేశం కేవలం అనిశ్చితిని, అభద్రతనూ పరస్పర ద్వేషాన్ని సృష్టించడం మాత్రమే. తద్వారా ఎన్నికల తరుణంలో మతపరమైన విభజన సృష్టించాలి. అయితే అత్యంత ప్రముఖంగా చెప్పుకోవలసిందేమింటే చొరబాటుదారులను గుర్తించడం కోసం జరిపిన 'సర్' ప్రక్రియ చివరకు తేల్చింది సున్నా. గుచ్చి గుచ్చి అడిగిన తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తాము గుర్తించి ఓటర్ల జాబితా నుంచి తొలగించిన విదేశీ జాతీయుల వివరాలేంటో చెప్పలేకపోయారు.

కనుక పారదర్శకంగా, ప్రజాస్వామిక ప్రక్రియగా జరగాల్సిన 'సర్' రాజ్యాంగ పాలనా వ్యవస్థలను ధ్వంసం చేసే తప్పుడు తంతుగా దిగజార్చబడిందని ఇప్పుడు సూర్యోదయ కాంతి అంత స్పష్టంగా రుజువైపోయింది.

(అక్టోబరు 15 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

గాజాలో మారణాయుధాలుగా మారిన బిగ్ టెక్ కంపెనీలు

అంతర్జాతీయం

బప్పా సిన్హా

నిప్పుకు గాలి తోడైనట్టుగా, గాజాలో ఇజ్రాయిల్ జరిపిన నరమేధానికి, విధ్వంసానికి అమెరికా బడా టెక్ కంపెనీలు తోడయ్యాయి. ఇజ్రాయిల్ యుద్ధ యంత్రాంగంతో ఈ టెక్ కంపెనీల బంధం ఎంత లోతుగా, దృఢంగా పెనవేసుకుని ఉన్నదో ఇటీవల బయటికొచ్చిన పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ప్రపంచం ముందు నూతన ఆవిష్కరణలు, అభివృద్ధి అంటూ ప్రగతికాముక సంస్థలుగా నటించే ఈ కంపెనీల 'అసలు రంగు' ది గార్డియన్, +972 పత్రిక, లోకల్ కాల్ సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనలో వెల్లడైంది.

ఇజ్రాయిల్ మిలటరీ గూఢచారి విభాగం పేరు 8200. అది పాలస్తీనాలోని ప్రతి ఒక్క పౌరుడి ఫోను సంభాషణను, రికార్డు చేసి, భద్రపరిచి, విశ్లేషించడానికి మైక్రోసాఫ్ట్‌కి చెందిన క్లౌడ్ ప్లాట్‌ఫారం అజూర్‌ను వాడుకున్నది. 8200, మైక్రోసాఫ్ట్‌తో చేసుకున్న భాగస్వామ్య ఒప్పందం వల్ల ఇజ్రాయిల్‌కు అపరిమితమైన నిఘా సామర్థ్యం లభించింది. పాలస్తీనా ఆక్రమణలో అజూర్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్ ఉపయోగపడింది. అది అందించిన లక్షలాదిమంది పాలస్తీనియన్ల వ్యక్తిగత ఫోను సంభాషణలు ఇజ్రాయిల్‌కు ముడి సరుకుగా ఉపయోగపడ్డాయి. నిజానికి, మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యమే లేనట్టయితే ఇజ్రాయిల్ కంప్యూటర్ సర్వర్లకు భారీ డేటాను భద్రపరిచి విశ్లేషించే శక్తి సామర్థ్యాలు లేవు. ఈ విషయం ఇజ్రాయిల్‌కు తెలుసు. అందువలనే ఇజ్రాయిల్ మైక్రోసాఫ్ట్‌ను ఆశ్రయించింది. క్లౌడ్ ప్లాట్‌ఫామ్ వలన డేటా నిల్వ సామర్థ్యం "అనంతం"గా పెరిగింది. 1921లో మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లను, ఇజ్రాయిల్ గూఢచారి విభాగం 8200 కామాండర్ యెస్సి సరీల్ కలవటంతో ఈ ప్రాజెక్టు మొదలైంది.

అయితే, ఇజ్రాయిల్ సైన్యంతో మైక్రోసాఫ్ట్ కుమ్మక్కవడం ఇది మొదటిసారి కాదు. 2025 జనవరిలో +972 మ్యాగజైన్ చేసిన పరిశోధనలో మైక్రోసాఫ్ట్ ఇజ్రాయిల్ సైన్యం మధ్య లోతైన సంబంధాలు ఉన్నాయని తెలిసింది. ఇజ్రాయిల్ సైనిక కార్యకలాపాలకు నేరుగా మద్దతు ఇచ్చే ప్రాజెక్టులలో అజూర్, ఓపెన్ ఏఐ (కృత్రిమ మేధ)ల సహకారం ఉంది. ఇతర బిగ్ టెక్ మాదిరిగానే మైక్రోసాఫ్ట్ కూడా ఇజ్రాయిల్ ఆక్రమణ, అణచివేత సామూహిక హత్యలకు సాధనంగా మారింది. అజుర్‌పై ఇజ్రాయిల్ సైనిక గూఢచారి విభాగమే కాక, మిగతా అన్ని ఆర్మీ యూనిట్లు కూడా ఆధారపడ్డాయి.

ఇలా ఇజ్రాయిల్ గాజా మారణహోమంలో తోడైంది మైక్రోసాఫ్ట్ ఒక్కటి మాత్రమే కాదు. గూగుల్, అమెజాన్, పలాంటిర్ వంటి పెద్ద టెక్ కంపెనీలు ఈ మారణహోమంలో భాగస్వాములై డబ్బులు పోగేసుకున్నాయి. ప్రపంచం ముందు నూతన ఆవిష్కరణలు చేసి అభివృద్ధికి బాటలు వేసే కంపెనీలుగా గొప్పలు పోయే ఈ టెక్ కంపెనీలు వాస్తవంలో ఇజ్రాయిల్ యుద్ధ యంత్రాంగంలో అంతర్భాగం అయ్యాయి. ఈ టెక్ కంపెనీలు అమెరికా సైనిక-పారిశ్రామిక కూటమికి బయటకు ఆగుపడని వెన్నెముకలాగా పనిచేస్తున్నాయి. దీనికి తక్షణ ఉదాహరణగా, ప్రపంచం నడిబొడ్డున గాజాలో జరిపిన సామూహిక హత్యాకాండ మన కళ్ల ముందున్నది. ఇజ్రాయిల్‌తో అజుర్ కలవటంతో, మైక్రోసాఫ్ట్ వ్యాపారం వరకే పరిమితమైన తటస్థ సంస్థగా లేదు. అంతకు మించి ఇజ్రాయిల్ సంస్థలతో కలిసి టెక్నాలజీని అభివృద్ధి చేసి, స్థానిక నిఘా కంపెనీల్లో పెట్టుబడులు పెట్టి ఆ దేశంలో పరిశోధనా ప్రయోగ శాలలు నడుపుతున్నది. చివరికి పాలస్తీనాపై నియంత్రణలో ఇజ్రాయిల్ మైక్రోసాఫ్ట్ కంపెనీని వదులుకోలేని పరిస్థితి ఏర్పడింది.

> ఇజ్రాయిల్ గాజా మారణహోమంలో తోడైంది మైక్రోసాఫ్ట్ ఒక్కటి మాత్రమే కాదు. గూగుల్, అమెజాన్, పలాంటిర్ వంటి పెద్ద టెక్ కంపెనీలు ఈ మారణహోమంలో భాగస్వాములై డబ్బులు పోగేసుకున్నాయి. ప్రపంచం ముందు నూతన ఆవిష్కరణలు చేసి అభివృద్ధికి బాటలు వేసే కంపెనీలుగా గొప్పలు పోయే ఈ టెక్ కంపెనీలు వాస్తవంలో ఇజ్రాయిల్ యుద్ధ యంత్రాంగంలో అంతర్భాగం అయ్యాయి. ఈ టెక్ కంపెనీలు అమెరికా సైనిక-పారిశ్రామిక కూటమికి బయటకు ఆగుపడని వెన్నెముకలాగా పనిచేస్తున్నాయి. దీనికి తక్షణ ఉదాహరణగా, ప్రపంచం నడిబొడ్డున గాజాలో జరిపిన సామూహిక హత్యాకాండ మన కళ్ల ముందున్నది.

గూగుల్, అమెజాన్, నింబస్ ప్రాజెక్టు

ఈ వ్యవహారంలో మరో రెండు కంపెనీలు గూగుల్, అమెజాన్‌లు మైక్రోసాఫ్ట్ కంటే ఏ మాత్రం వెనకబడి లేవు. ఈ కంపెనీలు ఇజ్రాయిల్ ప్రభుత్వంతో 120 కోట్ల డాలర్లతో ప్రాజెక్టు నింబస్ కోసం ఒప్పందం కుదుర్చుకున్నాయి. ప్రాజెక్టు నింబస్ అంటే మరింత అభివృద్ధి పరిచిన క్లౌడ్ సదుపాయాలు, కృత్రిమ మేధ పరికరాలు అందుబాటులోకి తెచ్చే ప్రాజెక్టు. యంత్రాల ద్వారా ముఖాన్ని చూసి మనుషులను గుర్తించటం, భావోద్వేగాలను విశ్లేషించడం, శాంతి భద్రతల సమస్య ఎక్కడ తలెత్తుతుందో ముందుగానే గుర్తించడం ఈ ప్రాజెక్ట్ నింబస్‌లో భాగం. ఇవి పాలస్తీనా ప్రజలపై నిరంతరం నిఘా పెట్టగలిగిన సాంకేతిక సాధనాలు. 'తూర్పు జెరూసలెంలో అనుమానితులు' గురించిన డేటాను తయారు చేసి, వారిలో ఎవరిని చంపాలో జాబితా తయారు చేసివ్వటం నింబస్ ప్రాజెక్టులో భాగం.

పలంటీర్: డేటా ఆయుధ వ్యాపారి

గాజా మారణహోమంలో పాల్గొన్న మరో అమెరికా సంస్థ పలంటీర్. అమెరికా ప్రభుత్వపు అధికార గూఢచారి సంస్థ సిఐఏ పెట్టుబడితో, సహకారంతో ప్రారంభించబడిన పలంటీర్, ప్రస్తుతం అతి పెద్ద నిఘా సంస్థగా, మిలిటరీ గూఢచారి సంస్థగా పేరు తెచ్చుకున్నది. మైక్రో సాఫ్ట్, గూగుల్, అమెజాన్‌లు మౌలిక సదుపాయాలు అందిస్తే, పలంటీర్ విశ్లేషణాత్మక సాధనంగా పనిచేస్తున్నది. పాశ్చాత్య దేశాల గెలుపుకు తానే కారణమని గొప్పగా చెప్పుకుంటుంది పలంటీర్. ఇది ఇజ్రాయిల్ సైన్యానికి అందించే సేవలను విస్తృతంగా పెంచింది. ఇటువంటి వ్యవస్థలే పాలస్తీనా పౌరుల చావులను వేగవంతం చేశాయి. పలంటీర్ యుద్ధాలను ఆసరా చేసుకుని పెరిగి పెద్దదైంది.

ప్రాణాలు తీసేందుకు 'లావెండర్' జాబితా

'లావెండర్' పేరుతో ఇజ్రాయిల్ కృత్రిమ మేధస్సుపై ఆధారపడిన ప్రోగ్రామ్‌ను తయారు చేసింది. గాజాలో తొలి నాళ్లలో పాలస్తీనియన్లపై బాంబుల వర్షం కురిపించడంలో, హత్యలకు లక్ష్యాలను నిర్ణయించడంలోనూ లావెండర్ కృత్రిమ మేధను బాగా ఉపయోగించుకున్నారు. కృత్రిమ మేధ లావెండర్ చేసే నిర్ణయాలు పూర్తిగా మనుషులు చేసిన నిర్ణయాలు లాగానే ఉండేవి. ఇది వందల వేలమంది పాలస్తీనియన్లను అనుమానాస్పద మిలిటెంట్లుగా పేర్కొని వారిని చంపేందుకు ఆటోమేటిక్‌గా జాబితాను తయారు చేస్తుంది. తర్వాత ఈ నిర్ణయాలు అమలై వేలాది మంది పౌరులు బలయ్యారు.

చాట్ జిపిటి వంటి జనరేటివ్ ప్లాట్‌ఫామ్‌లను ఆదర్శంగా తీసుకుని, ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్ కొత్త ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ తయారు చేస్తోంది. వీటి పని నిఘా నిర్వహించటం, ఆరోపణలు సంధించటం, అరెస్టులను వేగవంతం చేయడం. ఇది గాజాలో జరుగుతున్న హత్యాకాండకు మాత్రమే పరిమితం కాదు. భవిష్యత్తులో జరిగే యుద్ధాలకు, సామూహిక హత్యాకాండకు ఒక 'మెథడ్'గా మారబోతున్నది. ఈ టెక్నాలజీలను అమెరికా పెద్ద టెక్ కంపెనీలు కలిసి అభివృద్ధి చేస్తున్నాయి.

సామ్రాజ్యవాద ప్రయోగశాలగా ఇజ్రాయిల్

ఈ విషయాలన్నింటి కలిపి చూస్తే, అమెరికా సామ్రాజ్యవాదానికి ఇజ్రాయిల్ ఒక ప్రయోగశాలగా మారిందనిపిస్తుంది. పాలస్తీనియన్లపై ప్రయోగించిన ప్రతి ఆక్రమణ పద్ధతి తరువాత ప్రపంచానికి ఎగుమతి అవుతోంది. ఉదాహరణకు, వెస్ట్ బ్యాంక్‌లో మొదట ఉపయోగించిన "ప్రిడిక్టివ్ పోలీసింగ్" (అంటే ముందుగానే నేరాలను అంచనా వేసే సాఫ్ట్‌వేర్)ను ఇప్పుడు అమెరికా పోలీసు శాఖలకు అమ్ముతున్నారు. ఈస్ట్ జెరూసలెంలో మొదట ఉపయోగించిన బయోమెట్రిక్ చెక్ పాయింట్లు ఇప్పుడు అమెరికా-మెక్సికో సరిహద్దులో కనిపిస్తున్నాయి. గాజాలో పరీక్షించిన కృత్రిమ మేధ ఆధారిత నిఘా వ్యవస్థలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా నియంత ప్రభుత్వాలకు అమ్ముతున్నారు. బిగ్ టెక్ కంపెనీలకు (మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, పలాంటిర్) ఇజ్రాయిల్ ఒకవైపు పెద్ద కస్టమర్, మరోవైపు ఆ కంపెనీలు తమ టెక్నాలజీలను పరీక్షించుకునే లేబరేటరీ. ఈ కంపెనీలు ఇజ్రాయిల్ సైనిక వ్యవస్థలో భాగమై, అణచివేత టెక్నాలజీలను కలిసి అభివృద్ధి చేస్తాయి. తరువాత అవి ప్రపంచమంతా అమ్ముకునే ఉత్పత్తులవుతాయి.ఆ కారణంగా గాజాలో జరుగుతున్న విధ్వంసం కేవలం రాజకీయ ప్రాజెక్టు మాత్రమే కాదు. గూఢచర్యం, యుద్ధం, సామూహిక హత్యలను వ్యాపారంగా మార్చే నమూనాగానూ మారింది.

ఐక్యరాజ్యసమితి హెచ్చరిక

పాలస్తీనా విషయాలపై ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి ఫ్రాన్సిస్కా అల్బానీస్ ఇప్పటికే హెచ్చరిక ఇచ్చారు. ఆమె మానవ హక్కుల మండలికి సమర్పించిన నివేదికలో, గాజాపై ఇజ్రాయిల్ చేసిన 21 నెలల దాడిలో అమెరికా బిగ్ టెక్ కంపెనీల పాత్రను వివరించారు. ఈ కంపెనీలు యుద్ధనేరాలకు అవసరమైన సాంకేతిక మౌలిక వసతులు, సేవలందించి, ఆ దాడులను సులభతరం చేశాయని ఆమె తెలిపారు. ఆమె నివేదిక ఒక స్పష్టమైన నిజాన్ని చెబుతుంది: బిగ్ టెక్ పక్కన నిలబడి చూసే సంస్థ కాదు, అది గాజా హత్యాకాండలో సామ్రాజ్యవాద యుద్ధ యంత్రంలో ఒక భాగంగా చురుకుగా పాల్గొంటున్న భాగస్వామి.

బిగ్ టెక్, అమెరికా యుద్ధ పరిశ్రమలది వీడని బంధం

అమెరికా రక్షణ శాఖ (పెంటగన్)కు, గూఢచారి సంస్థ (ఎన్ఎస్ఏ)కు ప్రపంచంలోని అతి పెద్ద టెక్ కంపెనీలు బాగా విశ్వసించదగిన కాంట్రాక్టర్లుగా పనిచేస్తున్నాయి. ఇదేమీ ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. అమెజాన్ వెబ్ సర్వీసు సీఐఏ డేటాను భద్రపరుస్తుంది. మైక్రోసాఫ్ట్ అజుర్ అమెరికా రక్షణ వ్యవస్థలకు సాంకేతిక మద్దతు కల్పిస్తుంది. గూగుల్ సైనిక కృత్రిమ మేధ ప్రాజెక్టులపై కలిసి పనిచేస్తుంది. పలంటీర్ గూఢచారి సంస్థల కోసం రూపొందించిన సాధనం. ఈ విధంగా, బిగ్ టెక్, సైనిక, పరిశ్రమల, గూఢచారి వ్యవస్థల కలయిక పూర్తయింది. ఈ ప్రాజెక్టు ఇజ్రాయిల్‌లో మాత్రమేగాక ప్రపంచవ్యాప్తంగా ఉంది. పర్యవేక్షణ, లక్ష్యాల నిర్దేశన, ప్రజలపై నిఘా ద్వారా ఈ కంపెనీలు లాభాలు పొందుతున్నాయి.

ప్రతిఘటన-భవిష్యత్ మార్గం

అయితే ప్రతిఘటన ఆగలేదు. కొనసాగుతోంది. గూగుల్, అమెజాన్ లోని కొంతమంది ఉద్యోగులు ఈ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా గొంతెత్తుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు, విశ్వవిద్యాలయాలు యుద్ధ లబ్ధిదారులతో సంబంధాలు తెంచుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మానవ హక్కుల సంస్థలు ఈ కార్పొరేట్ నేరాలను ప్రపంచం ముందు పెడుతున్నాయి. పాలస్తీనాలో ప్రజలు చూపిస్తున్న అచంచల పోరాట పటిమ, ఏ యంత్ర మేధస్సు తొలగించలేని ఆత్మస్థైర్యానికి నిదర్శనం. అయితే ఈ ప్రతిఘటన ఇంకా విస్తృతం కావాలి. ఈ డిజిటల్ యుద్ధ వ్యాపారులను ఎదుర్కోవాలి.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

SRK GROUP OF INSTITUTIONS
AUTONOMOUS
Approved by AICTE & Affiliated to JNTU Kakinada - ISO 9001:2015 Certified Institution
Enikepadu - Vijayawada - 521108. Ph: **2843839.** Email: srktech@gmail.com web: www.srkit.in

CAT-B, SPOT Admissions B.Tech, MBA, MCA, M.Tech (CSE), M.Tech (CSE-AIML), M.Tech (VLSI) & IMBA

CAT-B, Spot Admissions for **B.Tech, MBA, MCA, M.Tech(CSE), M.Tech (CSE-AIML), M.Tech (VLSI) & IMBA** vacancies will be filled in the following colleges as per guidelines issued by the convener.

SRK INSTITUTE OF TECHNOLOGY
AUTONOMOUS - Approved by AICTE, Affiliated to JNTU, Kakinada, E-mail: srktech@gmail.com

VIJAYA INSTITUTE OF TECHNOLOGY FOR WOMEN
Approved by AICTE, Affiliated to JNTU, Kakinada, E-mail: vijayatechfw@gmail.com
The Interested candidates, not Joined any where may approach the Principals with all Original Certificate with Tuition fee. Admissions are made as per APSCHE Guidelines. Sd/- **Secretary**

DBS

వేలం నోటీసు

మా బ్యాంక్ యొక్క క్రింద పేర్కొన్న గోల్డ్ ఓడి కస్టమర్లకు మేము పదే పదే గుర్తు చేసిన తర్వాత కూడా వారు బకాయి ఉన్న వడ్డీ మొత్తాన్ని చెల్లించడంలో విఫలమయ్యారని తెలియజేయడమైనది. అందువల్ల దీనిని **నిరర్థక ఆస్తి (ఎన్‌పిఎ)** గా వర్గీకరించడమైనది. రసీదు చెల్లించాల్సిన రిజిస్టర్డ్ లేఖలు ఇప్పటికే బ్యాంకులో వారి నమోదిత చిరునామాకు పంపబడ్డాయి.

పూర్తి రుణ మొత్తం/ గడువు ముగిసిన మొత్తాన్ని **24.10.2025న** లేదా అంతకు ముందు సెటిల్ చేయకపోతే, కస్టమర్ తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను **24.10.2025న ఉ. 11.00 గం.కు** లేదా బ్యాంకుకు అనుకూలమైన ఏదైనా ఇతర తేదిన వేలం ద్వారా విక్రయిస్తారు, తదుపరి నోటీసు లేకుండా మరియు బ్యాంకు పూర్తి సంతృప్తి చెంది బ్యాంకు ప్రాంగణంలో లేదా ఇ-వేలం ప్లాట్‌ఫామ్ **https://egold.auctiontiger.net** లో బహిరంగ వేలం అమ్మకం ద్వారా విక్రయం జరుగుతుంది.

రిఫ్.నం.	కస్టమర్ పేరు	శాఖ పేరు	స్థూల బరువు	నికర బరువు
27329381	అకుల రత్న మాణిక్యం	గురునానక్ కాలనీ, విజయవాడ	99.80	92.60
27328285	వెంకటేశ్వర రావు విన్నకోట	గురునానక్ కాలనీ, విజయవాడ	87.40	85.50

తేది : 15.10.2025 — **అధీకృత అధికారి**
ప్రదేశం : చెన్నై — **డిబిఎస్ బ్యాంక్ ఇండియా లిమిటెడ్**
డిబిఎస్ బ్యాంక్ ఇండియా లిమిటెడ్, డిబిఎస్ బ్యాంక్ లిమిటెడ్ సింగపూర్ నుండి పూర్తి లైసెన్స్ క్రింద ఉన్న అనుబంధ సంస్థ.

Bank of India
Relationship beyond banking

బ్యాంక్ ఆఫ్ ఇండియా
బాపులపాడు బ్రాంచి, డి.నెం.5-48/1, శుభకృష్ణ ఎన్‌క్లేవ్, విజయవాడ రోడ్డు, బాపులపాడు, ఫోన్: 08656-245255

సంక్షిప్త డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద-జారీచేయబడిన నోటీసు)

... **(కుమారుడు), తండ్రి: లేటు యమ్.సింహాచలం,** డి.నెం.1-14, వెలమల బజారు, కనుమోలు, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా, ఎ.పి.-521106. **3) శ్రీమతి మర్రపు ఆదిలక్ష్మి (కోడలు), భర్త: కిరణ్ కుమార్,** డి.నెం.1-14, వెలమల బజారు, కనుమోలు, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా, ఎ.పి.-521106. **4) శ్రీమతి మర్రపు రమాదేవి (కోడలు), భర్త: లేటు వెంకటేశ్వరరావు,** డి.నెం.1-14, వెలమల బజారు, కనుమోలు, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా, ఎ.పి.-521106. **5) శ్రీమతి రెడ్డి రాధా కుమారి (కుమార్తె), తండ్రి: లేటు సింహాచలం, భర్త: సత్య సుధీర్,** డి.నెం.28-1-9/18, 9వ రోడ్డు, ఫారంగులదిబ్బ చెరువు, శాంతి నగర్, ఏలూరు (రూరల్), పశ్చిమ గోదావరి-524007. **6) శ్రీ మర్రపు ధనుష్ కుమార్ (మనుమడు), (శ్రీ యమ్.వెంకటేశ్వరరావు మరణించినప్పటి నుండి చట్టబద్ధవారసులు) తండ్రి: లేటు మర్రపు వెంకటేశ్వరరావు,** డి.నెం.1-14, వెలమల బజారు, కనుమోలు, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా, ఎ.పి.-521106.

వ. నెం.	సదుపాయం యొక్క స్వభావం	మంజూరైన పరిధి (రూ.)	బకాయిసొమ్ము
1	Cash Credit (563930110000007)	రూ. 15,00,000/-	రూ.12,88,919.29 + 21.01.2024 తేదీ నుండి 13.85% పి.ఎ. చొప్పున వడ్డీ మరియు అన్ని ఖర్చులు & వ్యయాలు
2	Term Loan (563965910000002)	రూ. 4,10,000/-	రూ.3,67,309.00 + 30-12-2023 తేదీ నుండి 13.85% పి.ఎ. చొప్పున వడ్డీ మరియు అన్ని ఖర్చులు & వ్యయాలు
	మొత్తము	రూ. 19,10,000/-	రూ.16,56,228.29 + తదుపరి వడ్డీ మరియు అన్ని ఖర్చులు & వ్యయాలు

పైన పేర్కొనబడిన ఋణసౌకర్యములు ఈ క్రింద తనఖావుంచబడిన ఆస్తులపై మంజూరు చేయడమైనది. (బ్యాంకుకు తనఖావుంచబడిన ఆస్తులు / ఆస్తి యొక్క వివరములు):

స్థిరాస్తి యొక్క వివరములు: ఐటమ్ నెం.1: కృష్ణా జిల్లా, కనుమోలు సబ్ రిజిస్ట్రేషన్ ఏరియా, బాపులపాడు మండలం, కనుమోలు గ్రామ పంచాయతీ ఏరియా మరియు గ్రామము, ఆర్.యస్. నెం.70/3 నందు **ఐటమ్-1 ఆస్తి యొక్క 27-04-2005 తేదీగల ఒరిజినల్ దస్తావేజు నెం. 1033/2005 ద్వారా రిజిష్టర్డ్ కాబడిన శ్రీ మర్రపు సింహాచలం పేరునగల** య॥ 0.07 సెంట్లు అనగా 339 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ స్థలము. **ఆస్తికి హద్దులు: తూర్పు:** గరికిపాటి వెంకటేశ్వరరావు యొక్క స్థలము; **దక్షిణం:** కొయ్యల లక్ష్మయ్య యొక్క స్థలము; **పడమర:** శ్రీ మర్రపు సింహాచలం యొక్క స్థలము; **ఉత్తరం:** పైడి శేషు యొక్క స్థలము.

ఐటమ్ నెం.2: కృష్ణా జిల్లా, కనుమోలు సబ్ రిజిస్ట్రేషన్ ఏరియా, బాపులపాడు మండలం, కనుమోలు గ్రామ ...

... ఆస్తులపై చర్య తీసుకొనుటకు ఉపక్రమించి ఋణగ్రహీతకు తేది.14-10-2025న రిజిష్టర్ పోస్టు ద్వారా పంపించిన డిమాండ్ నోటీసు చిరునామాలో లేరని బట్వాడా కాకుండా తిరిగి వచ్చినందున ఈ ప్రకటన జారీచేయడమైనది. సదరు ఋణగ్రహీత/ హామీదారు/ తనఖాదారులు పైన పేర్కొన్న మొత్తములను ఈ ప్రకటన తేదీ నుండి 60 రోజులలోగా, వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము బ్యాంకు బకాయిని రాబట్టుకొను నిమిత్తం ఋణగ్రహీత/ హామీదారు/ తనఖాదారులు పైన తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

తేది: 14.10.2025, ప్రదేశం: బాపులపాడు — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

పట్నా సంచలనం

బెంగాల్‌పై చివర్లో గెలుపు
ప్రొ కబడ్డీ సీజన్-12

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద-జారీచేయబడిన నోటీసు)

ఋణగ్రహీత(లు), హామీదారు(లు) మరియు తనఖాదారు (లు) యొక్క పేర్లు మరియు చిరునామా: 1) మెస్సర్స్ హనుమాన్ ఏజెన్సీస్, C/o.శ్రీమతి మర్రపు ఆదిలక్ష్మి(యజమాని), డి.నెం.2/67/5, గుడివాడ రోడ్డు, బాపులపాడు, కృష్ణా జిల్లా-521105. **2) శ్రీమతి మర్రపు ఆదిలక్ష్మి, భర్త: కిరణ్ కుమార్,** డి.నెం.1-14, వెలమల బజారు, కనుమోలు, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా, ఎ.పి.-521106. **శ్రీ మర్రపు సింహాచలం (మరణించినారు),** డి.నెం. 1-14, వెలమల బజారు, కనుమోలు, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా, ఎ.పి.-521106.

శ్రీ మర్రపు సింహాచలం మరణించినప్పటినుండి అతని తరపున చట్టబద్ధవారసులు:

1) శ్రీమతి మర్రపు నరసమ్మ (భార్య), భర్త: లేటు యమ్.సింహాచలం, డి.నెం.1-14, వెలమల బజారు, కనుమోలు, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా, ఎ.పి.-521106. **2) శ్రీ మర్రపు కిరణ్ కుమార్ (కుమారుడు), తండ్రి: లేటు యమ్.సింహాచలం,** డి.నెం.1-14, వెలమల బజారు, కనుమోలు, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా, ఎ.పి.-521106. **3) శ్రీమతి మర్రపు ఆదిలక్ష్మి (కోడలు), భర్త: కిరణ్ కుమార్,** డి.నెం.1-14, వెలమల బజారు, కనుమోలు, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా, ఎ.పి.-521106. **4) శ్రీమతి మర్రపు రమాదేవి (కోడలు), భర్త: లేటు వెంకటేశ్వరరావు,** డి.నెం.1-14, వెలమల బజారు, కనుమోలు, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా, ఎ.పి.-521106. **5) శ్రీమతి రెడ్డి రాధా కుమారి (కుమార్తె), తండ్రి: లేటు సింహాచలం, భర్త: సత్య సుధీర్,** డి.నెం.28-1-9/18, 9వ రోడ్డు, ఫారంగులదిబ్బ చెరువు, శాంతి నగర్, ఏలూరు (రూరల్), పశ్చిమ గోదావరి-524007. **6) శ్రీ మర్రపు ధనుష్ కుమార్ (మనుమడు), (శ్రీ యమ్.వెంకటేశ్వరరావు మరణించినప్పటి నుండి చట్టబద్ధవారసులు) తండ్రి: లేటు మర్రపు వెంకటేశ్వరరావు,** డి.నెం.1-14, వెలమల బజారు, కనుమోలు, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా, ఎ.పి.-521106.

వ. నెం.	సదుపాయం యొక్క స్వభావం	మంజూరైన పరిధి (రూ.)	బకాయిసొమ్ము
1	Cash Credit (563930110000003)	రూ. 15,00,000/-	రూ.12,67,890.72 + 21.01.2024 తేదీ నుండి 13.85% పి.ఎ. చొప్పున వడ్డీ మరియు అన్ని ఖర్చులు & వ్యయాలు
2	Term Loan (563965910000001)	రూ. 4,10,000/-	రూ.3,67,980.00 + 30-12-2023 తేదీ నుండి 13.85% పి.ఎ. చొప్పున వడ్డీ మరియు అన్ని ఖర్చులు & వ్యయాలు
	మొత్తము	రూ. 19,10,000/-	రూ.16,35,870.72 + జమకూడు వడ్డీ మరియు అన్ని ఖర్చులు & వ్యయాలు

పైన పేర్కొనబడిన ఋణసౌకర్యములు ఈ క్రింద తనఖావుంచబడిన ఆస్తులపై మంజూరు చేయడమైనది. (బ్యాంకుకు తనఖావుంచబడిన ఆస్తులు / ఆస్తి యొక్క వివరములు):

స్థిరాస్తి యొక్క వివరములు: ఐటమ్ నెం.1: కృష్ణా జిల్లా, కనుమోలు సబ్ రిజిస్ట్రేషన్ ఏరియా, బాపులపాడు మండలం, కనుమోలు గ్రామ పంచాయతీ ఏరియా మరియు గ్రామము, ఆర్.యస్. నెం.70/3 నందు **ఐటమ్-1 ఆస్తి యొక్క 27-04-2005 తేదీగల ఒరిజినల్ దస్తావేజు నెం. 1033/2005 ద్వారా రిజిస్టర్డ్ కాబడిన శ్రీ మర్రపు సింహాచలం పేరునగల** య॥ 0.07 సెంట్లు అనగా 339 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ స్థలము. **ఆస్తికి హద్దులు: తూర్పు:** గరికిపాటి వెంకటేశ్వరరావు యొక్క స్థలము; **దక్షిణం:** కొయ్యల లక్ష్మయ్య యొక్క స్థలము; **పడమర:** శ్రీ మర్రపు సింహాచలం యొక్క స్థలము; **ఉత్తరం:** పైడి శేషు యొక్క స్థలము.

తేది: 14.10.2025, ప్రదేశం: బాపులపాడు సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

kotak **కోటక్ మహీంద్రా ప్రైమ్ లిమిటెడ్**
రిజిస్టర్ చిరునామా: 27 బికెసి, గ్రౌండ్ ఫ్లోర్, ప్లాట్ నెం.సి-27, 'జి' బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా ఈస్ట్, ముంబై-400051.
6-3-1109/1, 2వ అంతస్తు, నవభారత్ ఛాంబర్స్, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్-500082.

డిమాండ్ నోటీసు

ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు భద్రతా వడ్డీ అమలు చట్టం, 2002లోని సెక్షన్ 13(2) కింద చట్టబద్ధమైన నోటీసు.

కింద సంతకం చేసిన వ్యక్తి, 1949 బ్యాంకింగ్ నియంత్రణ చట్టం ప్రకారం బ్యాంకింగ్ కంపెనీ అయిన **కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి, దీని రిజిస్టర్డ్ కార్యాలయం 27 బికెసి, సి 27, జి బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఇ), ముంబై-400 051 వద్ద ఉంది మరియు బ్రాంచ్ ఆఫీస్ కూడా ఉంది, **ప్రాంతీయ కార్యాలయం : 6-3-1109/1, 2వ అంతస్తు, నవభారత్ ఛాంబర్స్, రాజ్భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్ 500 082,** (ఇకపై "ది బ్యాంక్ / కెఎంబిఎల్" అని పిలుస్తారు) వద్ద సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం ఆఫ్ ఫైనాన్షియల్ ఆస్తులు మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 కింద నియమించబడింది, ఇందుమూలంగా మీకు ఈ క్రింది నోటీసు జారీ చేయబడింది. ఈ నోటీసు పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(2) మరియు రూల్ 3 సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 ప్రకారం జారీ చేయబడింది.

రుణగ్రహీత(లు)/హామీదారు(లు) పేరు	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం
లోన్ ఖాతా నం. 7813369706, 7747టిఎల్0100000089 సిఆర్ఎన్ నం. 378927808 1. ఎమ్/ఎస్ ఆర్.కె బిల్డర్లు మరియు దేవలపర్లు దాని యజమాని శ్రీమతి కామిరెడ్డి కళ్యాణి ప్రాతినిధ్యం వహిస్తున్నారు 15-14-152/ఎ 3వ లైన్, శ్రీకాంత్ నగర్, ఆర్‌టిసి కాలనీ గుంటూరు-522001, ఆంధ్రప్రదేశ్, భారతదేశం ఇక్కడ కూడా **ఎమ్/ఎస్ ఆర్.కె బిల్డర్లు మరియు దేవలపర్లు** దాని యజమాని శ్రీమతి కామిరెడ్డి కళ్యాణి ప్రాతినిధ్యం వహిస్తున్నారు డోర్ నం. 54-6-1856 3వ లైన్, శ్రీకాంత్ నగర్, ఆర్‌టిసి కాలనీ గుంటూరు-522001, ఆంధ్రప్రదేశ్, భారతదేశం ఇక్కడ కూడా **ఎమ్/ఎస్ ఆర్.కె. బిల్డర్లు మరియు దేవలపర్లు** దాని యజమాని శ్రీమతి కామిరెడ్డి కళ్యాణి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. డోర్.నెం.580, 581/ఎ, 589/ఎ, 590 మొక్క గుంటూరు, డోర్.నెం.581/ఎ మొక్క గుంటూరు, ప్లాట్ నెం : 52, డోర్.నెం.15-18-128, వాటర్ ట్యాంక్ దగ్గర, నందివెలుగు రోడ్డు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, గుంటూరు - 522001. ఆంధ్రప్రదేశ్, భారతదేశం (రుణగ్రహీత) 2. **శ్రీ కామిరెడ్డి కళ్యాణి కామిరెడ్డి రంగ స్వామి రెడ్డి యొక్క భార్య** 15-14-152/ఎ 3వ లైన్, శ్రీకాంత్ నగర్, ఆర్‌టిసి కాలనీ గుటూరు-522001, ఆంధ్రప్రదేశ్, భారతదేశం ఇక్కడ కూడా శ్రీ కామిరెడ్డి కళ్యాణి కామిరెడ్డి రంగ స్వామి రెడ్డి యొక్క భార్య డోర్.నెం.580, 581/ఎ, 589/ఎ, 590 మొక్క గుంటూరు, డోర్.నెం.581/ఎ మొక్క గుంటూరు, ప్లాట్ నెం : 52, డోర్.నెం.15-18-128, వాటర్ ట్యాంక్ దగ్గర, నందివెలుగు రోడ్డు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, గుంటూరు - 522001., ఆంధ్రప్రదేశ్, భారతదేశం (యజమాని), 3. **శ్రీ కామిరెడ్డి రంగ స్వామి రెడ్డి కామిరెడ్డి బాల రంగ రెడ్డి యొక్క కుమారుడు** 15-14-152/ఎ 3వ లైన్, శ్రీకాంత్ నగర్, ఆర్‌టిసి కాలనీ గుంటూరు-522001, ఆంధ్రప్రదేశ్, భారతదేశం ఇంకా ఇక్కడ: శ్రీ కామిరెడ్డి రంగ స్వామి రెడ్డి స్లో కామిరెడ్డి బాల రంగ రెడ్డి డోర్.నెం.580, 581/ఎ, 589/ఎ, 590 మొక్క గుంటూరు, డోర్.నెం.581/ఎ మొక్క గుంటూరు, ప్లాట్ నెం : 52, డోర్.నెం.15-18-128, వాటర్ ట్యాంక్ దగ్గర, నందివెలుగు రోడ్డు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, గుంటూరు - 522001. ఆంధ్రప్రదేశ్, భారతదేశం (గ్యారంటర్).	**30 సెప్టెంబర్, 2025** ఎన్‌పిఎ తేదీ: **05-ఆగస్టు-2025** మొత్తం బకాయి మొత్తం **18-సెప్టెంబర్-2025** నాటికి **రూ.1,37,23,563.22/-** (ఒక కోటి ముప్పై ఏడు లక్షల ఇరవై మూడు వేల ఐదువందల అరవై మూడు రూపాయల ఇరవై రెండు పైసలు)

సెక్యూర్డ్ ఆస్తి (స్థిర ఆస్తి) వివరణ: అనుబంధం ఎ : హైపోథికేటెడ్ చేయబడిన కదిలే ఆస్తుల వివరాలు:- రుణగ్రహీత యొక్క ప్రస్తుత మరియు భవిష్యత్తు ప్రస్తుత-అద్దె ఆస్తులు మరియు కదిలే స్థిర, కదిలే స్థిర, ప్రస్తుత మరియు భవిష్యత్తుతో సహా, ప్రస్తుత మరియు భవిష్యత్తుతో సహా., ఎ. రుణగ్రహీత యొక్క ముడి పదార్థాల నిల్వలు, ప్రాసెస్‌లో ఉన్నవి, సెమీ-ఫినిష్డ్ మరియు ఫినిష్డ్ వస్తువులు, వినియోగ దుకాణాలు మరియు విడిభాగాలు మరియు అటువంటి...

ప్రదేశం: గుంటూరు, తేది: 18-10-2025 సం/- (అధీకృత అధికారి) కోటక్ మహీంద్రా ప్రైమ్ లిమిటెడ్

అదానీ సేవలో తరిస్తున్న మోడీ సర్కార్

- భారత గ్రిడ్‌కు గొడ్డా ప్లాంట్ అనుసంధానం
- కొత్త ట్రాన్స్‌మిషన్ పవర్ లైన్‌కు మార్గం సుగమం

న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన బడా వ్యాపారవేత్త అదానీ సేవలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పరితపిస్తోంది. ఆయనకు కష్టం వస్తే ఆదుకునేందుకు ముందుండే కేంద్ర ప్రభుత్వం.. మరోసారి దానిని నిరూపించింది. జార్ఖండ్‌లోని గొడ్డా థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఇండియన్ నేషనల్ ఎలక్ట్రిసిటీ గ్రిడ్‌కు అనుసంధానించేందుకు లైన్ క్లియర్ చేసింది. ఇందుకు అదానీ పవర్ లిమిటెడ్ (ఎపిఎల్)కు అనుమతినిచ్చింది. అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం ఇప్పటివరకు ఈ ప్లాంట్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ మొత్తం బంగ్లాదేశ్‌కు సరఫరా అయ్యేది. ఇప్పుడు దీనిని భారత గ్రిడ్‌కు అనుసంధానిస్తూ మోడీ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం గమనార్హం. తాజా నిర్ణయంతో ఏపీఎల్ ఇప్పుడు గొడ్డా ప్లాంట్‌ను భారతదేశ ఇంటర్-స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ (ఐఎస్‌టిఎస్)కు అనుసంధానించే కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్ (పవర్‌లైన్)ను వేస్తుంది. ఇది రాష్ట్రాల మధ్య విద్యుత్‌ను తరలించే హై-వోల్టేజ్ జాతీయ గ్రిడ్. ఇది ఇప్పటికే ఉన్న కహల్గావ్ ఏ- మైథాన్ బి 400 కెవి లైన్‌కు లైన్-ఇన్-లైన్-అవుట్ (ఎల్ఐఎల్ఓ) కనెక్షన్‌ను ఉపయోగించి చేయబడుతుంది. ఈ ట్రాన్స్‌మిషన్ లైన్ గొడ్డా జిల్లాలోని 56 గ్రామాల గుండా వెళ్లనున్నది. మోడీ సర్కార్.. అదానీ పవర్‌కు కొన్ని న్యాయ అధికారాలనూ కట్టబెట్టింది. ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్, 1885 కింద టెలిగ్రాఫ్ అథారిటీకి ఉండే అధికారాలనే కేంద్రం అదానీ పవర్‌కు కల్పించింది. దీని అర్థం.. ప్రయివేటు ప్రాపర్టీ మీదుగా స్తంభాలు, లైన్లను వేసే అధికారం ఉంటుంది. అయితే దీనికి కొన్ని షరతులు ఉంటాయి. ఎలక్ట్రిసిటీ యాక్ట్, 2003లోని సెక్షన్ 164ను అనుసరించి ఈ అధికారాలను కట్టబెట్టారు.

కేంద్రం నిర్ణయంపై ఆందోళనలు

అయితే అదానీ పవర్‌కు మోడీ సర్కార్ మార్గం సుగమం చేసేలా అనుమతివ్వటంపై పలు అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే.. గొడ్డా ప్లాంట్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్)లో ఉన్నది. మార్చి, 2019లో అప్పటి కేంద్రం ప్రభుత్వమే ఈ ప్రకటన చేసింది. ప్రత్యేకించి బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను ఎక్స్‌పోర్ట్ చేసేందుకు ఈ ప్లాంట్‌ను నిర్మించారు. అయితే గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్‌లో అక్కడి ప్రభుత్వం మారింది. కొత్త వచ్చిన తాత్కాలిక ప్రభుత్వం గొడ్డా ప్లాంట్ నుంచి విద్యుత్ కొనుగోలును తగ్గించటం, లేదా ఆపేయటం చేసింది. దీంతో బంగ్లాదేశ్‌కు అవసరం లేకుంటే.. వినియోగంలో లేని ఈ విద్యుత్‌ను భారత్‌లో విక్రయించటానికి అనుమతి కోసం అదానీ పవర్ అభ్యర్థించింది. అదానీ పవర్ కోసం పలు ప్రభుత్వ ఏజెన్సీలు కదిలాయి. నిబంధనలు, మార్గదర్శకాలను సవరించాయి.

కదిలిన ప్రభుత్వ యంత్రాంగాలు.. మారిన నిబంధనలు, మార్గదర్శకాలు

భారత్‌లో విద్యుత్ విక్రయానికి అనుమతి కోసం గతేడాది ఆగస్టులో అదానీ కంపెనీ అనుమతి కోరింది. దీంతో విద్యుత్ మంత్రిత్వ శాఖ క్రాస్-బోర్డర్ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ గైడ్‌లైన్స్‌ను గతేడాది ఆగస్టులో సవరించింది. ఇక గతేడాది ఆగస్టులోనే కేంద్ర విద్యుత్ సంస్థ (సిఇఎ) కూడా తన సాంకేతిక నిబంధనలను మార్చింది. కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (సిఇఆర్‌సి) సైతం తన నియమాలను అదే ఏడాది డిసెంబర్‌లో సవరించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో కేంద్రం ట్రాన్స్‌మిషన్ కనెక్షన్‌కు అధికారికంగా ఆమోదం తెలిపింది. తాజాగా కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో అదానీ గొడ్డా ప్లాంట్ నుంచి భారత గ్రిడ్‌కు విద్యుత్ సరఫరాకు మార్గం సుగమమైంది. ఈ అనుమతి 25 ఏండ్ల పాటు చెల్లుబాటు అవుతుంది. ఎపిఎల్.. రైల్వే, రహదార్లు, ఏవియేషన్, రక్షణ వంటి స్థానిక, జాతీయ సంస్థల నుంచి తప్పక అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ట్రాన్స్‌మిషన్ రూట్ అనేది జిఐబి ప్రొటెక్టెడ్ జోన్స్ గుండా వెళ్తే.. కంపెనీ సుప్రీంకోర్టు జారీ చేసిన పర్యావరణ నిబంధనలను తప్పక పాటించాల్సి ఉంటుంది.

ప్లాంట్ నేపథ్యం

అదానీకి చెందిన గొడ్డా ప్లాంట్ 1600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ పవర్ స్టేషన్. ఇది జార్ఖండ్‌లోని గొడ్డాలో ఉన్నది. ఇది భారతదేశపు మొట్టమొదటి అంతర్జాతీయ విద్యుత్ ప్రాజెక్ట్. దీని ప్రధాన లక్ష్యం బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను సరఫరా చేయడం. ఈ ప్లాంట్ అదానీ గ్రూప్ అనుబంధ సంస్థ అయిన అదానీ పవర్ ద్వారా నిర్వహించబడుతోంది. 2019లో ఈ ప్లాంట్‌ను స్పెషల్ ఎకనామిక్ జోన్‌గా ప్రకటించారు. దీంతో పన్నులు, సుంకాలపై గణనీయమైన రాయితీలను ఈ ప్లాంట్ పొందింది. బంగ్లాదేశ్ పవర్ డెవలప్‌మెంట్ బోర్డు (బిపిడిబి)తో చేసుకున్న దీర్ఘకాలిక ఒప్పందం ప్రకారం ఈ ప్లాంట్ బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. 2023లో ఇది పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించింది. 2024 ఆగస్టులో బంగ్లాదేశ్‌లో పాలనా మార్పుల తర్వాత.. మోడీ ప్రభుత్వం ఈ ప్లాంట్‌ను భారతీయ పవర్ గ్రిడ్‌కు తాత్కాలికంగా అనుసంధానిం చడానికి అనుమతినిచ్చింది. బంగ్లాదేశ్ నుంచి డిమాండ్ తక్కువగా ఉన్నప్పుడు లేదా చెల్లింపుల్లో సమస్యలు తలెత్తినప్పుడు ఈ ప్లాంట్ నుంచి భారత్‌లోని గ్రిడ్‌కు విద్యుత్ సరఫరా చేయడానికి ఇది వీలు కల్పించింది. కేంద్రం తాజా ఆమోదంతో ఈ అనుసంధానానికి 25 ఏండ్ల పాటు శాశ్వత ఆమోదం లభించినట్టయ్యింది.

గొడ్డా ప్లాంట్‌పై పలు వివాదాలు

అదానీ గొడ్డా ప్లాంట్‌పై ఇప్పటికే అనేక వివాదాలు ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో ఈ ప్లాంట్ నుంచి అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయడంపై విమర్శలు వచ్చాయి. ఇక భూసేకరణ చట్టం-2013ను ఉల్లంఘించి మరీ బలవంతంగా భూములను స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలూ వెల్లువెత్తాయి. ఆ సమయంలో స్థానిక రైతులు, గిరిజనులు దీనిపై నిరసనలు కూడా చేశారు. ఈ ప్లాంట్ నిర్మాణంతో పర్యావరణ కాలుష్యం పెరుగుతుందనీ, కార్మికులకు సరైన ఉపాధి ప్రమాణాలు లేవని పర్యావరణవేత్తలు, కార్మిక సంఘాల నుంచి ఆందోళనలూ వ్యక్తమయ్యాయి. ఇక విద్యుత్ ఎక్స్‌పోర్ట్ కోసం సెజ్ హోదా పొందినప్పటికీ.. ఈ ప్లాంట్ దేశీయంగా విద్యుత్‌ను విక్రయించేందుకు నిబంధనలను మార్చడం అదానీ గ్రూపునకు మాత్రమే లబ్ధిని చేకూరుస్తుందని విశ్లేషకులు, మేధావులు ఆరోపిస్తున్నారు.

మోడీతో సమావేశమైన హరిణి

శ్రీలంక ప్రధానితో మోడీ భేటీ

న్యూఢిల్లీ : ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న శ్రీలంక ప్రధాని హరిణి అమరసూర్య శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. అభివృద్ధి సహకారం, భారత జాలర్ల సంక్షేమం వంటి పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. విద్య, మహిళా సాధికారత, వినూత్న ఆవిష్కరణలు, అభివృద్ధి సహకారం వంటి పలు అంశాలపై శ్రీలంక ప్రధానితో సమగ్రంగా చర్చలు జరిపామని మోడీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఇరుగు పొరుగు దేశాలుగా, మన సహకారం మన రెండు దేశాల ప్రజల సంక్షేమానికి చాలా కీలకమైనదని మోడీ పేర్కొన్నారు.

మంత్రిగా ప్రమాణం చేస్తున్న రివబ జడేజా

గుజరాత్‌లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ

- డిప్యూటీ సిఎంగా హర్ష్ సంఘవి

గాంధీనగర్ : గుజరాత్‌లో మంత్రివర్గాన్ని పునవ్యవస్థీకరించారు. శుక్రవారం 25 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ అచార్యదేవవ్రత్ కొత్త మంత్రుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. పాత మంత్రుల్లో ఆరుగురికి మాత్రమే మళ్లీ అవకాశం లభించింది. 19 మంది కొత్తగా మంత్రివర్గంలో చేరారు. రాష్ట్ర హోం మంత్రి హర్ష్ సంగవి ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రముఖ క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివబ జడేజాకు మంత్రి పదవి లభించింది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ కోసం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా మిగిలిన మంత్రులంతా గురువారం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. బిజెపి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేబినెట్‌లో మార్పులుచేర్పులు చేయడం విశేషం.

యుపిలో దళితులకు రక్షణ కరువు

- కాంగ్రెస్ నేత రాహుల్ విమర్శ
- మూకదాడిలో హత్యకు గురైన హరిఓం కుటుంబానికి పరామర్శ

రాయ్‌బరేలి : ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ హాయంలో దళితులకు, పేదలకు రక్షణ కరువైందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ విమర్శించారు. యుపిలోని రాయ్‌బరేలి నుంచి ఆయన ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నెల 2న రాయ్‌బరేలిలో కొందరు గూండాలు హరిఓం వాల్మీకి అనే దళితుడిని కొట్టి చంపారు. ఈ నేపథ్యంలో మృతుడి మామ చౌదరి భక్తదాస్, ఇతర కుటుంబ సభ్యులను శుక్రవారం నాడు రాహుల్ పరామర్శించారు.

ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ దళితులను రక్షించడంలో, మూకదాడులను అరికట్టడంలో యోగి సర్కార్ ఘోరంగా విఫలమైందన్నారు. కాగా రాహుల్ పరామర్శకు వస్తున్నారన్న నేపథ్యంలోనే మృతుడి సోదరికి ఫతేపూర్ మెడికల్ కాలేజీలో స్టాఫ్ నర్సుగా (కాంట్రాక్ట్ పద్ధతిలో) నియమిస్తూ యోగి సర్కార్ ఆఫర్ లెటర్ అందజేయడం గమనార్హం.

మడగాస్కర్ అధ్యక్షుడిగా కల్నల్ మైఖెల్

అంటానానారివో : మడగాస్కర్ నూతన అధ్యక్షుడిగా సైన్యాధిపతి 51 ఏళ్ల కల్నల్ మైఖెల్ రాండ్రియానిరినా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు.. తన ఉన్నత బాధ్యతలను పూర్తిగా, న్యాయంగా నెరవేరుస్తానని జాతీయ ఐక్యతకు, మానవ హక్కుల పరిరక్షణకు శక్తి వంచన లేకుండా పని చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రెండేళ్లలో దేశంలో కొత్తగా ఎన్నికలు నిర్వహిస్తామని, అంతవరకు సైనిక నేతృత్వంలోని పరివర్తన కమిటి ప్రభుత్వంతో కలిసి పని చేస్తుందని ప్రకటించారు. దీనికి అమెరికా ప్రతినిధులతో సహా పలు రాజకీయ నాయకులు హాజరయ్యారు. జన్‌జెడ్ ఉద్యమంతో గత అధ్యక్షుడు రాజోలినా దేశం విడిచి ఫ్రాన్స్ పారిపోయిన సంగతి తెలిసిందే. అనంతరం సైన్యం అధికారాన్ని హస్తగతం చేసుకుని జాతీయ అసెంబ్లీ మినహా అన్నీ చట్ట సంస్థలను రద్దు చేసింది. నుతన అధ్యక్షుడైన కల్నల్ మైఖెల్ గతంలో రాజోలినాను అధికారంలోకి తీసుకువచ్చిన 2009 తిరుగుబాటులో ముఖ్యమైన పాత్ర పోషించారు. కాని అతనితో తెగతెంపులు చేసుకుని జన్ జడ్ ఉద్యమానికి మద్దతు తెలిపారు. ప్రజలపై ఎటువంటి కాల్పులు జరపొద్దని సైన్యానకి ఆదేశాలిచ్చారు. పేద దేశమైన మడగాస్కర్‌లో దాదాపు 80% జనాబా దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి..

నామినేషన్ దాఖలుకు ముందు నిర్వహించిన ర్యాలీలో బిభూతిపుర్ సిపిఎం అభ్యర్థి అజయ్ కుమార్, పొలిట్‌బ్యూరో సభ్యులు అమ్రారామ్ తదితరులు

ప్రజాగళం వినిపిస్తాం

- బీహార్‌లో సిపిఎం అభ్యర్థులు
- నామినేషన్లు దాఖలు

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపిస్తే..ప్రజాగళం వినిపిస్తామని సిపిఎం అభ్యర్థులు తెలిపారు. మహాగట్ బంధన్ తరపున నలుగురు సిపిఎం అభ్యర్థులు బరిలో దిగుతున్నారు. బిభూతిపూర్ నుంచి అజయ్ కుమార్, మాంఝీ నుంచి సత్యేంద్రయాదవ్, హయాఘాట్ నుంచి శ్యాం భారతి, పిప్రా నుంచి రాజ్‌మంగళ్ ప్రసాద్ పోటీ చేస్తున్నారు. శుక్రవారం బిభూతిపూర్ అసెంబ్లీ స్థానానికి సిపిఎం అభ్యర్థి అజయ్ కుమార్ నామినేషన్ పత్రం దాఖలు చేశారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ, బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు అమ్రారామ్ హాజరయ్యారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ లాలన్ చౌదరి, కేంద్ర కమిటీ సభ్యులు అవధేష్ కుమార్ కూడా ఉన్నారు.

కుల దురహంకార హత్యల నివారణకు కమిషన్

- అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై : పరువు పేరుతో కులాల ప్రాతిపదికన జరిగే విద్వేష నేరాలు, హత్యలను నివారించేందుకు ఒక చట్టాన్ని రూపొందించడంపై అవసరమైన చర్చలు, సంప్రదింపులు జరిపేందుకు కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెఎన్ బాషా నేతృత్వాన ఈ కమిషన్ ఏర్పాడుతుందని, ఈ కమిషన్ విస్తృతంగా చర్చలు, సంప్రదింపులు జరిపి ప్రభుత్వానికి తన సిఫార్సులను అందచేస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కమిషన్‌లో న్యాయ నిపుణులు, ప్రగతిశీల ఆలోచనాపరులు, ప్రముఖ సామాజికవేత్తలు వుంటారని తెలిపారు. రాజకీయ సంఘాలు, సంస్థలతో, న్యాయ నిపుణులతో, సామాజిక కార్యకర్తలతో, బాధితులతో ఈ కమిషన్ చర్చలు జరుపుతుంది. వారి నుండి సూచనలు తీసుకుని, ప్రభుత్వానికి కొన్ని సిఫార్సులు చేస్తుందని చెప్పారు. వీటి ప్రాతిపదికగా, రాష్ట్ర ప్రభుత్వం కుల ప్రాతిపదికన లేదా పరువు కోసం జరిగే హత్యలను నివారించడంపై చట్టాన్ని రూపొందిస్తుందని తెలిపారు.

జనగణన-2027 నోటిఫికేషన్ జారీ

- వచ్చే నెలలో ముందస్తు సర్వే

న్యూఢిల్లీ : జనగణన - 2027కు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన కసరత్తు వచ్చే నవంబరు నెల నుంచే ప్రారంభం కానుంది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ శుక్రవారం నాడు ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ముందస్తు సర్వే ప్రక్రియ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎంపిక చేసిన నమూనా ప్రాంతాల్లో గృహ జాబితా, గృహ గణనను కవర్ చేస్తుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. జనగణన-2027 తొలి దశ కోసం చేపట్టే ముందస్తు సర్వేను సులభతరం చేయడానికి 1948 జనాభా లెక్కల చట్టంలోని నిబంధనలను పొడిగిస్తూ కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దీని ప్రకారం 2027లో చేపట్టే జనాభా లెక్కలకు వచ్చే నెల నవంబర్ 10 నుంచి 30 వరకు ముందస్తు సర్వే చేపట్టనున్నారు. నివాసితులకు నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించారు. ప్రధాన సర్వేకు ముందు వారు డిజిటల్‌గా సమాచారాన్ని పొందుపర్చడానికి ఏర్పాట్లు చేశారు. 2027లో రెండు దశల్లో జనగణన చేపట్టనున్నారు. దీంతో పాటే కులగణన కూడా చేపట్టనున్నట్టు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలిపింది.

పాస్‌పోర్ట్ సూచీలో భారత్‌కు 85వ స్థానం

న్యూఢిల్లీ : హెన్లీ పాస్‌పోర్ట్ సూచీ-2025లో భారత్ 85వ స్థానానికి పడిపోయింది. 57 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించే అవకాశాన్ని కల్పిస్తోంది. గతేడాది 62 గమ్యస్థానాలకు వీసా రహిత ప్రయాణ అవకాశంతో ఇదే జాబితాలో 80వ స్థానంలో ఉండేది. కాగా 193 దేశాలకు వీసా రహిత ప్రయాణ అవకాశంతో సింగపూర్ అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌గా కొనసాగుతోంది. ఈ సంవత్సరం 190 దేశాలతో దక్షిణ కొరియా రెండవ స్థానంలో, 189 దేశాలకు ప్రయాణించడానికి అనుమతిస్తూ జపాన్ మూడవ స్థానంలో నిలిచింది. జర్మనీ, ఇటలీ, లక్సెంబర్గ్, స్పెయిన్ , స్విట్జర్లాండ్ 4వ స్థానంలోనూ, ఆస్ట్రియా, బెల్జియం, డెన్మార్క్, ఫిన్లాండ్, ఫ్రాన్స్, ఐర్లాండ్ , నెదర్లాండ్స్ 5వ స్థానంలోనూ నిలిచాయి.

కాల్పుల విరమణ ఉల్లంఘనే

- లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులను ఖండించిన ఇరాన్

తెహ్రాన్ : లెబనాన్‌పై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇలా దాడులకు పాల్పడ్డాన్ని హెజ్బొల్లా, ఇజ్రాయిల్‌కు మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్పష్టంగా ఉల్లంఘించడమేనని ఇరాన్ విమర్శించింది. ఇజ్రాయిల్ దాడులను ఆపడానికి అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఘై ఒక ప్రకటన విడుదల చేశారు. ఇజ్రాయిల్ నిరంతర దాడులను 'లెబనాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత స్పష్టమైన ఉల్లంఘన'గా బఘై విమర్శించారు. ఈ ప్రాంతంలో శాంతికి హామీ ఇచ్చిన అమెరికా, ఫ్రాన్స్‌లు ఇప్పుడు నిశ్శబ్దంగా ఉండటాన్ని ఇరాన్ ఈ ప్రకటనలో ఖండించింది. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని అరికట్టడానికి అంతర్జాతీయ సమాజం కఠినమైన, సమన్వయంతో కూడిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జమ్ముకాశ్మీర్‌లో 'దర్బార్ బదిలీ' పునరుద్ధరణ

జమ్మూ : దర్బార్ బదిలీ పద్ధతిని పునరుద్ధరించనున్నట్లు జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రకటించారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాల మేరకు నాలుగేళ్ళ పై నుండి ఈ పద్ధతిని నిలిపివేశారు. ఖర్చులు తగ్గించుకునేందుకే ఈ పద్ధతిని నిలిపివేసినా దీనివల్ల జమ్మూ ప్రాంతంలోని వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలు కొంతమేరా దెబ్బతిన్నాయి. 1872లో కాశ్మీర్ మహారాజు గులాబ్ సింగ్ ఈ దర్బార్ మూవ్‌ను ప్రవేశపెట్టారు. ఈ పద్ధతి కింద సివిల్ సెక్రటేరియట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు వేసవి కాలంలో శ్రీనగర్ నుండి, శీతాకాలంలో జమ్మూ నుండి పనిచేస్తాయి. దీనివల్ల ఆర్థిక వ్యవస్థకు లాభాలు వుంటాయని సిఎం అన్నారు. ఆమోదం నిమిత్తం ఫైల్‌ను లెఫ్టినెంట్ గవర్నర్‌కు పంపారు.

కొత్త బంగ్లాదేశ్ ఆవిర్భావం !

- తాత్కాలిక చీఫ్ యూనస్ వెల్లడి
- జులై చార్టర్‌పై 25 రాజకీయ పార్టీల సంతకాలు
- పార్లమెంట్ వద్ద ఆందోళనల నేపథ్యంలో ప్రకటన

జులై చార్టర్‌ను ఆవిష్కరిస్తున్న తాత్కాలిక చీఫ్ మహ్మద్ యూనస్

ఢాకా : 'జులై చార్టర్' గా పిలిచే జాయింట్ డిక్లరేషన్‌పై సంతకాలతో 'కొత్త బంగ్లాదేశ్' ఆవిర్భవించిందని తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ మహ్మద్ యూనస్ శుక్రవారం ప్రకటించారు. పార్లమెంట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నేతలు దీనిపై సంతకాలు చేశారు. దీంతో నూతన బంగ్లాదేశ్ ఆవిర్భవించిందని యూనస్ వ్యాఖ్యానించారు. జులై ఫైటర్లకు దేశం రుణపడి వుందని యూనస్ వ్యాఖ్యానించారు. మాజీ ప్రధాని ఖలీదా జియాకి చెందిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ సహా 25 పార్టీలు దీనిపై సంతకాలు చేశాయని పత్రికా విభాగం తెలిపింది. ప్రభుత్వాన్ని నడిపేందుకు గానూ వివిధ రంగాల్లో 80కి పైగా సంస్కరణల సిఫార్సులను పొందుపరుస్తూ జాతీయ ఏకాభిప్రాయ కమిషన్ ఈ చార్టర్‌ను రూపొందించింది. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్, రాజకీయ పార్టీల మధ్య బృహత్తరంగా సాగిన చర్చల అనంతరం 'జులై చార్టర్'ను రూపొందించారు. అయితే బంగ్లాదేశ్ తాత్కాలిక నేత మహ్మద్ యూనస్‌కు కీలక మిత్రపక్షమైన నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సిపి) విద్యార్థి విభాగం ఈ డాక్యుమెంట్‌పై సంతకాలు చేయబోమని తెలిపింది. ఈ డాక్యుమెంట్‌కు సరైన చట్ట ప్రాతిపదిక లేదంటూ ఈ సంతకాల కార్యక్రమాన్ని బహిష్కరించింది. జాతీయ ఏకాభిప్రాయం పేరుతో కొన్ని రాజకీయ పార్టీలు ఈ డాక్యుమెంట్‌పై సంతకం చేస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నాయని ఎన్‌సిపి కన్వీనర్ నహీద్ ఇస్లామ్ విమర్శించారు. సంతకాల కార్యక్రమానికి కొద్ది గంటల ముందు యూనస్ నేతృత్వంలోని జాతీయ ఏకాభిప్రాయ కమిషన్ ఈ చార్టర్‌కు సవరణను తీసుకువచ్చినట్లు ప్రకటించింది. గతేడాది ఆగస్టులో షేక్ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు సమయంలో వారు పోషించిన పాత్రకు గానూ జులై ఫైటర్లను గుర్తిస్తూ చార్టర్‌లోని ఒక క్లాజుకు సవరణ తీసుకువచ్చారు. ఎన్‌సిపిని బుజ్జగించేందుకే ఈ సవరించిన ముసాయిదాలో ఫాసిస్ట్ అవామీ లీగ్ అనే పదాలను చేర్చారు. కాగా ఈ చార్టర్‌లోని పలు ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధంగా వున్నాయని పేర్కొంటూ వీటిపై అసమ్మతిని వ్యక్తం చేస్తున్నామని అంతకుముందు బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ వెల్లడించింది.

పార్లమెంట్ వద్ద ఆందోళనలు

'జులై చార్టర్' సంతకాల కార్యక్రమాన్ని నిరసిస్తూ వందలాదిమంది ఆందోళనకారులు అక్కడ ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరారు. వారిని అక్కడ నుండి వెళ్లిపోవాల్సిందిగా కోరినా ఎవరూ అక్కడ నుండి కదలకపోవడంతో పోలీసులు లాఠీలతో రంగంలోకి దిగారు. బంగ్లాదేశ్ పార్లమెంట్‌కు సమీపంలో మోహరించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలను, గ్రెనెడ్లను ప్రయోగించారు. లాఠీలు ఝుళిపించారు.

గతేడాది ఆగస్టులో షేక్ హసీనా ప్రభుత్వాన్ని గద్దె దింపిన నిరసనల్లో గాయపడిన వారికి చట్టపరమైన రక్షణ కల్పించి, వారికి పునరావాసం కల్పించాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. నిరసనకారులు అక్కడ గల రెండు పోలీసు వాహనాలను ధ్వంసం చేశారు. ఎంపీల భవనం ముందు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ రూమ్‌ను, కంట్రోల్ రూమ్‌ను, ఫర్నిచర్‌ను తగలబెట్టారు.

రాష్ట్రానికి మోడీ శఠగోపం

(మొదటిపేజి తరువాయి)

అంతర్జాతీయ అవార్డులు కూడా ఇవ్వొచ్చని అన్నారు. జైరాజ్ ఫ్యాక్టరీకి ప్రారంభోత్సవం చేశారని, 1100 మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి 300 మందికి ఇచ్చారని అన్నారు. నిర్మాణ కార్మికులను ఉపాధి లెక్కల్లో చూపిస్తున్నారన్నారు. బిజెపి గతంలో టిడిపిని తిట్టి రాయలసీమ డిక్లరేషన్ పేరుతో రూ.20 వేల కోట్లు స్పెషల్ ప్యాకేజీ అని డిమాండు చేశారని, కానీ శాసనసభలో బిజెపి నాయకులు ఎవరూ దీని గురించి మాట్లాడటం లేదని తెలిపారు. ఆర్‌డిఎస్, వేదావతి, గుండ్రేవుల అభివృద్ధి లేదన్నారు. హంద్రీనీవా ద్వారా 125 చెరువులకు నీటిని ఇస్తే వేల ఎకరాలు సాగులోకి వస్తాయని చెప్పారు. వాటిని అభివృద్ధి చేయడానికి ఎవరు అడ్డుపడ్డారని ప్రశ్నించారు. బిజెపి నాయకులు చెప్పే అభివృద్ధి బూటకం, రాయలసీమ డిక్లరేషన్ నాటకం అన్నారు. దానిని కప్పిపుచ్చుకునేందుకు జిఎస్‌టి పేరుతో సభలు జరుపుతున్నారన్నారు. జిఎస్‌టి వల్ల పెద్దగా మిగిలేదేమీ లేదని అన్నారు. రూ.5000 కోట్లు పెడితే మెడికల్ కళాశాలలు పూర్తవుతాయని, అయినా చేయకుండా గూగుల్‌కు రూ.22 వేల కోట్లు మినహాయింపులు ఇచ్చారని ప్రపంచ చరిత్రలో ఇంత పెద్దమొత్తంలో సబ్సిడీ ఇచ్చింది లేదన్నారు. ట్రంప్ టారిఫ్‌లు విధించిన సమయంలో విదేశాలపై ఆధారపడటమే ప్రధాన శత్రువు అన్నారని, ఆత్మనిర్భర్ భారత్ పేరుతో గూగుల్‌ని తెచ్చి పెడుతున్నారని, ఇది ఎలా ఆత్మ నిర్భర్ అవుతుందని ప్రశ్నించారు. ఇప్పటికీ ఇండియాకు సొంత సెర్చ్ ఇంజన్ లేదని తెలిపారు. గూగుల్, మైక్రోసాఫ్ట్‌ను పోషించింది ఇండియన్లేనని, మన నాలెడ్జితో ఎదిగి రూ.85 వేలకోట్లు పెట్టుబడి పెడతామని అంటే రూ.22 వేల కోట్లు రాయితీ ఇస్తున్నారని అన్నారు. డేటా సెంటర్ వల్ల వచ్చే వేడి చాలా ఎక్కువని తెలిపారు. అమెరికాలోని వర్జీనియాలో దీన్ని వ్యతిరేకించి, లాగిపెట్టి తంతే ఇండియాకు వచ్చి పెడుతున్నారని చెప్పారు. దాని నుండి ఉత్పత్తయ్యే వేడితో విశాఖ ప్రజల భవిష్యత్ ఏమిటని ప్రశ్నించారు. విశాఖలో అదానీకి 300 ఎకరాలు ఇచ్చారని, ఇప్పుడు గూగుల్‌కు 500 ఎకరాలు ఇచ్చారని అన్నారు. గూగుల్‌తో ఒప్పందం తరువాత అదానీ భాగస్వామని బయటపెట్టారని పేర్కొన్నారు. మోడీ మిత్రుడు కావడంతో అన్ని కంపెనీల్లోనూ ఆయనకు వాటా ఇస్తున్నారని అన్నారు. గతంలో ఇచ్చిన 300 ఎకరాలు తిరిగి ప్రజలకు ఇస్తారా ? ఇవ్వరా ? చెప్పాలని ప్రశ్నించారు. సింహాచలం పంచగ్రామాల్లో 164 ఎకరాలకు ఇప్పటి వరకూ పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. గూగుల్‌కు మాత్రం 160 ఎకరాలు ఉచితంగా ఇచ్చారని అన్నారు. పేదల గోళ్లాడగొట్టి కార్పొరేట్లకు రాయితీలు ఇవ్వడమేనా ఆత్మనిర్భర్ భారత్ అని ప్రశ్నించారు. బిజెపి అధికారంలో ఉండి రాయలసీమ డిక్లరేషన్ అమలు చేయకపోవడంపై ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ మోడీని పొగడటం మాని రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టాలని సూచించారు. కేంద్రం ప్రకాశం జిల్లాలో నిమ్జ్ పేరుతో 5000 ఎకరాలు తీసుకున్నారని, పరిశ్రమలు ఏమీ పెట్టలేదన్నారు. కాకినాడలో 10వేల ఎకరాలు ఖాళీగా ఉన్నాయని, అక్కడ ప్రజలు పోరాడుతుంటే 2500 ఎకరాలు వెనక్కు ఇచ్చారని అన్నారు. 2019లో చంద్రబాబు, 2024లో జగన్ ఓడిపోవడానికి మోడీ పల్లకి మోయడమే కారణమని అన్నారు. బిజెపితో కలిసిన ఏ ప్రాంతీయ పార్టీ బాగుపడింది లేదని అన్నారు. బిజెపి మోసపూరిత చర్యలను ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. గూగుల్ ఒప్పందాలు బయటపెట్టి వేల కోట్ల సబ్సిడీలను ప్రజలకు ఖర్చు చేయాలని, మెడికల్ కళాశాలలను పూర్తి చేయాలని కోరారు. పర్యావరణాన్ని దెబ్బకొట్టే డేటా సెంటర్లను పెట్టొద్దని అన్నారు. దీనివల్ల టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ కూడా అవదని, అది లేకుండా రాయితీలు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. గూగుల్‌కు ఇస్తున్న సబ్సిడీలన్నా ఆపాలని, లేదా 22 శాతం ప్రభుత్వానికి వాటా ఇవ్వాలని డిమాండు చేశారు. డిఎస్‌సి తప్ప ఉపాధి కల్పన మరొకటి ఏదీ రాష్ట్రంలో లేదన్నారు. ఎంఎస్ఎంఇలు మూతపడుతున్నాయని అన్నారు. ప్రైవేటు పరిశ్రమల్లో లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడం అబద్ధమని తెలిపారు. అనకాపల్లి జిల్లా రాజయ్యపేటలో 52 మంది క్యాన్సర్‌తో చనిపోయారని, దీనికి అక్కడ ఫార్మా కాలుష్యమే కారణమని చెప్పారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే హోమ్‌శాఖ మంత్రి అనిత ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు.

గ్రామపంచాయతీల పునర్ వ్యవస్థీకరణ!

(మొదటిపేజి తరువాయి)

యూనిట్లుగా ఏర్పాటు చేస్తారు. గ్రామ పంచాయతీలకు గ్రేడింగ్ విధానం కొత్తగా తీసుకొస్తున్నారు. నూతనంగా ఏర్పాటు కానున్న రూర్బన్ పంచాయతీలకు రూరల్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆఫీసరుగా గ్రేడ్-1 కార్యదర్శులను నియమిస్తారు. రూర్బన్ పంచాయతీలు కాకుండా మిగిలిన పంచాయతీలను మూడు గ్రేడులుగా పునర్వర్గీకరణ చేస్తారు. ఈ మేరకు పంచాయతీల్లోని ఉద్యోగులు, అధికారుల పోస్టుల అప్‌గ్రేడేషన్, పునర్వ్యవస్థీకరణకు జిల్లాల నుంచి ప్రభుత్వం ఇటీవల ప్రతిపాదనలు స్వీకరించింది. ఆయా పోస్టులకు ప్రత్యేక స్కేల్స్ నిర్ణయించింది. అదనపు ఆర్థిక భారం లేకుండా అధికారుల పేర్లు, హోదాను మార్పు చేయనున్నారు. ఇక మీదట పంచాయతీ సెక్రటరీ పోస్టు పేరును పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (పిడిఒ)గా మార్చనున్నట్లు సమాచారం,

జూనియర్ అసిస్టెంట్ పోస్టుల అప్‌గ్రేడేషన్‌లో భాగంగా 1,097 సాంక్షన్ స్ట్రెంగ్త్ నుండి 359 జూనియర్ అసిస్టెంట్/జూనియర్ అసిస్టెంట్-కమ్-బిల్ కలెక్టర్ పోస్టులను సీనియర్ అసిస్టెంట్ పోస్టులుగా ఉద్యోగోన్నతి కల్పించి రూర్బన్ పంచాయతీల్లో నియమిస్తారు ఉద్యోన్నతులకు శిక్షణ తప్పనిసరి చేసింది. ఇందులో భాగంగా ఇంటర్-కేడర్ ఉద్యోగోన్నతులకు రెండు వారాల సంస్థాగత శిక్షణ, ఒక సంవత్సరం ఆన్-జాబ్ శిక్షణ అవసరమని నిర్ణయించింది. వేతన స్కేలు మార్పు లేకుండా మినిస్టీరియల్ సిబ్బందికి ఫీల్డ్ అనుభవం, ఎగ్జిక్యూటివ్ సిబ్బందికి ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ ఇస్తారు. కొత్తగా డిప్యూటీ ఎంపిడిఒలను ఎంపిక చేయనున్నారు. ఇందులో భాగంగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమితులైన డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు ఫౌండేషన్ శిక్షణ పూర్తయిన తర్వాత కనీసం మూడు సంవత్సరాల పాటు రూర్బన్ పంచాయతీల్లో పిడిఒలుగా సేవలందించాలని, గ్రామ పంచాయతీల పర్యవేక్షణలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి వీరు పాటుపడాలని నిర్ణయించారు. పంచాయతీల్లో డెడికేటెడ్ ఐటి విభాగం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సర్‌ప్లస్ డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర అర్హత కలిగిన సిబ్బందిని ఉపయోగించి గ్రామ పంచాయతీ రికార్డులను, పరిపాలనా ప్రక్రియలను డిజిటలైజ్ చేయిస్తారు. వర్క్‌ఫ్లో ఆటోమేషన్, రియల్-టైమ్ పర్యవేక్షణకు ఒక డెడికేటెడ్ ఐటి విభాగాన్ని ఏర్పాటు చేయడానికి డిజిటల్ అసిస్టెంట్ల సేవలను వినియోగించుకుంటారు.

అందాల దీపావళి

అందాల పండుగ దీపావళి
ఆనందాల దీపావళి
వెన్నెల వెలుగుల దీపావళి
భలే నవ్వుల పండుగ దీపావళి.

వరుసగా దీపాలను పెట్టి
దివ్వెలను చేతను బట్టి
దివ్వి దివ్వి అంటూ కొట్టి
పెద్దలను తలచు పండుగ

చిట పట లాడే సీమ టపాసులు
నింగికి ఎగిరే తారాజువ్వలు
కాంతులు చిమ్మే చిచ్చు బుడ్లు
పిల్లలకిష్టం కాకర వొత్తులు.

నల్లగ ఎగిసే పాము బిళ్ళలు
జివ్వుల వెలుగుల మతాబులు
రయ్యని తిరిగే భూ చక్రాలు
డాం అని పేలే లక్ష్మీ బాంబులు.

అమ్మ చేసెను తీపి మిఠాయిలు
నాన్న తెచ్చేరు కొత్త బట్టలు
అక్క వెలిగించు వరుస దీపాలు
పక్కనుంటారు బామ్మ, తాతలు

పిల్లల పండుగ దీపావళి
పెద్దల పండుగ దీపావళి
జాగ్రత్తలు పాటించి అందరు
జరపాలి ప్రతి ఏడు దీపావళి.
నవ్య దీపావళి – దివ్య దీపావళి.

- కూచిమంచి నాగేంద్ర,
91821 27880.

దీపావళి వెలుగులు

పటాకులు పటాపటా మంటూ
ఆకాశంలో రంగుల వెలుగు
చిన్నారుల నవ్వులు చినుకుల్లా
దీపావళి రోజు మెరిసిపోతాయి

నూనె దీపం వెలిగిస్తే
చీకటి దూరం పారిపోతుంది
మనసు నిండా సంతోషం
ఇంటింటా వెలుగై నిలుస్తుంది

కొత్త బట్టలు వేసుకున్నా
తల్లిదండ్రుల ప్రేమే బహుమతి
మిత్రుల తోడు మరింత మధురం
దీపావళి రోజున అందరిది పండుగ

పటాసులు గాలిలో ఎగిరి
ఆకాశాన్ని ముస్తాబు చేస్తాయి
పిల్లల కలల పువ్వులు
రంగురంగుల వర్షం కురిపిస్తాయి

మిఠాయిల మాధుర్యంతో
ప్రతి మనసు తియ్యగా మారుతుంది
దీపావళి కాంతులలో
చిన్నారుల మోము ముత్యం అవుతుంది.

సంతోషం అనే దీపం
ప్రతి హృదయంలో వెలిగించాలి
దీపావళి పండుగ అర్థం
ప్రేమతో అందరినీ కలపాలి.

- ఆరాల నిహాల్ యాదవ్,
5వ తరగతి, ఎస్ఆర్ఎం స్కూలు,
కోదాడ,
సూర్యాపేట జిల్లా.

ఆ పిల్లల చిరునవ్వుల్లో నిజమైన దీపావళి

'**దీ**పావళి అంటే నిజమైన అర్థం మార్పుకు ముందడుగు' అని అంటారు. విశాఖపట్నంలోని ప్రజ్వల వాణి వెల్ఫేర్ సొసైటీ ప్రతి ఏడూ ఈ పండుగకి ఆ అర్థాన్ని తీసుకొస్తోంది. సంస్థ తరఫున ఏర్పాటుచేసే స్టాళ్లల్లో మట్టి ప్రమిదలు, రంగుల్లో ఉన్నవి, ప్యాక్ చేసినవి.. ఇలా రకరకాలుగా వరుసలు పేర్చి విక్రయానికి సిద్ధం చేస్తారు. ఎంతో అందంగా, చూడముచ్చటగా ఉన్న వీటిని డౌన్‌సింద్రోమ్‌తో బాధపడుతున్న చిన్నారులు చేశరంటే ఆశ్చర్యపోతాం. అంతలా ఆ పిల్లలు వాటిని తయారు చేస్తారు. ఈ ఏడాది కూడా స్టాల్‌ని ఏర్పాటుచేసిన ఆ చిన్నారుల గురించి తెలుసుకుందాం.

వైకల్యంతో బాధపడుతున్న పిల్లలతో ప్రమిదలు, కొవ్వొత్తులు, ఇతర అలంకరణ వస్తువులు తయారు చేయడం 2013 నుండి సంస్థ విధిగా చేస్తోంది. ఈ ఏడాది 2000 ప్రమిదలు తయారు చేయించింది. వాటిల్లో వెయ్యి వరకు కొవ్వొత్తులు ఉన్నాయి. ఈసారి ప్రత్యేకంగా ఏనుగు ఆకారంలో, చిమ్నీ రూపంలో తయారుచేసినట్లు సంస్థ నిర్వాహకురాలు సుజాత చెప్పారు. వీటి వెనుక ఉన్న లక్ష్యాన్ని కూడా ఆమె ఇలా వివరించారు.

'ఈ పిల్లలకి దీపావళి కేవలం పండుగ కాదు.. అది వారి ఆత్మవిశ్వాసానికి, సాధికారతకి ముందడుగు' అంటున్న సుజాత ఈ ఏడాది వినూత్నంగా తయారుచేసిన ప్రమిదల గురించి ఇలా చెప్పారు. 'దీపావళి రోజు ప్రమిదలు వెలిగించుకుని, ఆ తరువాత వాటిని చాలామంది పక్కన పడేస్తారు. మళ్లీ దీపావళికే వాటిని ఉపయోగిస్తారు. అయితే ఈసారి మేము తయారుచేయించిన ఏనుగు, చిమ్నీ ఆకారంలోని ప్రమిదలు ఏడాదంతా ఉపయోగించుకోవచ్చు. మా పిల్లలు ప్రమిదలు మాత్రమే తయారుచేయలేదు. వాటికి రంగులు కూడా అద్దారు. వీటిని పరిశీలిస్తే ఇవన్నీ ఎరుపు, ఆకుపచ్చ, నీలం రంగుల్లో ఉంటాయి. డౌన్‌సింద్రోమ్ పిల్లలు ఈ రంగులని ఎక్కువగా ఇష్టపడతారు. అందుకే వాటిని వినియోగించాం.

ప్రమిదలకి రంగులు వేయడం వెనుక మరో లక్ష్యం కూడా ఉంది. అలా చేస్తే వాటిని గుర్తించడం, లెక్కించడం చాలా సులభం. పిల్లలు తయారుచేసిన ఈ ప్రమిదలని వారే స్వయంగా విక్రయిస్తారు. డబ్బులు లెక్కపెట్టుకుని బాక్సులో వేసుకుంటారు. ఆ సమయంలో వారి ముఖాలు ఎంతలా వెలిగిపోతాయో చూస్తేనే అర్థమౌతుంది. మా లక్ష్యం కూడా అదే. పిల్లల్లో ఆత్మవిశ్వాసం, యాజమాన్య లక్షణాలు పెంపొందిస్తాం' అని ఆమె అంటున్నారు.

ఒక్కొక్కరిది ఒక్కో కథ..

ప్రమిదలు తయారు చేసిన పిల్లల్లో ఆదిత్య వర్మ ఉంది. వైకల్యంతో మాటలు, నడక రాక ఆరేళ్ల వరకు ఇంటికే పరిమితమైంది. సంస్థకి వచ్చిన తరువాత తను మాట్లాడింది. నడిచింది.. ఇప్పుడు రాస్తోంది. స్నేహితులని సంపాదించుకుంటోంది. ఇక్కడికి వచ్చాకే ఆదిత్య ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి పూర్తిచేసింది. ప్రస్తుతం ఎస్‌కెఎంఎల్ కాలేజీలో రెగ్యులర్ డిగ్రీ చేస్తోంది.

నవీన్‌కి ఉన్న వినికిడి లోపం కారణంగా 4 ఏళ్ల వరకు అక్షరాలు నేర్చుకోవడమే ప్రారంభించలేదు. కానీ ఇప్పుడు డిగ్రీ చదువుతున్నాడు. ఒక్కడే బస్సు, యాప్ ఆధారిత ఏదేని రవాణాలో ఒంటరిగా ప్రయాణిస్తున్నాడు. స్టాల్లో పెట్టిన మొత్తం ప్రమిదల్లో తను ఒక్కడే 200 వరకు తయారుచేశాడు. ఇంకా విశేషమేమంటే డిగ్రీతో పాటు ఐటిఐ కూడా చేస్తున్నాడు.

ప్రణయ్ సాధించిన విజయాలు గురించి అయితే చాలా చెప్పుకోవాలి. వైకల్యంతో బాధపడే నవీన్ చిన్నతనంలోనే తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయాడు. సంస్థకి చేరుకున్నాక సైక్లింగ్‌లో సత్తా చాటుతున్నాడు. పారా అథ్లెటిక్‌గా జాతీయస్థాయిలో రాణిస్తున్నాడు. రజత పతకం కూడా సాధించాడు.

వైకల్యం వ్యాధి కాదని నిరూపిస్తూ.. ప్రతి దీపావళికి తమలోని కళలని వెలికితీస్తున్న ఈ పిల్లల చిరునవ్వుల్లో నిజమైన దీపకాంతి వెల్లివిరుస్తోంది.

నేను గీసిన బొమ్మ

పి.అక్షిత,
6వ తరగతి,
తెలంగాణ గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల,
చింతకుంట,
కరీంనగర్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

MINISTRY OF POWER
GOVERNMENT OF INDIA
BUREAU OF ENERGY EFFICIENCY

"భారతదేశ ఇంధన భవిష్యత్తు కోసం నా దార్శనికతకు నాలుగు స్తంభాలు ఉన్నాయి – ఇంధన ప్రాప్యత, ఇంధన సామర్థ్యం, ఇంధన స్థిరత్వం మరియు ఇంధన భద్రత"
నరేంద్ర మోడీ
ప్రధాన మంత్రి

35వ జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డుల (NECA)
కోసం BEE ఎంట్రీలను ఆహ్వానిస్తుంది.
మీ స్మార్ట్ ఎనర్జీ పద్ధతులు భారతదేశ హరిత భవిష్యత్తుకు ప్రమాణంగా నిలవనివ్వండి.

- ఇంధన సామర్థ్యం మరియు పరిరక్షణలో ఆదర్శప్రాయమైన ప్రయత్నాలను గుర్తించడానికి అవార్డులు
- నికర సున్నా వైపు భారతదేశం ప్రయాణాన్ని వేగవంతం చేయండి
- శక్తి సామర్థ్యంలో నాయకత్వాన్ని జరుపుకోండి

అర్హత గల రంగాలు
పరిశ్రమలు | సంస్థలు | రవాణా | ఇంధన నిపుణులు | భవనాలు | ఉపకరణాలు | ఆవిష్కరణలు
కంటెంట్ సృష్టికర్త

సమర్పించవలసిన చివరి తేదీ: 07 నవంబర్ 2025
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి: www.neca.beeindia.gov.in

దరఖాస్తు చేయడానికి
NECA పోర్టల్‌లో కొత్త యూజర్‌గా నమోదు చేసుకోండి → నిబంధనలు మరియు షరతులను చదివి అంగీకరించండి. → అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేయండి → మీ ఎంట్రీని ఆన్‌లైన్‌లో సమర్పించండి

CBC 34106/15/0012/2526

బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (BEE)
భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ కింద ఒక చట్టబద్ధమైన సంస్థ
/beeindiadigital /bureauofenergyefficiency

MINISTRY OF POWER
GOVERNMENT OF INDIA

"సుస్థిర వృద్ధి కోసం భారతదేశం యొక్క ప్రపంచ నిబద్ధతలను పూర్తిగా అనుసరిస్తూనే శక్తి న్యాయాన్ని నిర్ధారించడం భారతదేశ శక్తి ప్రణాళిక లక్ష్యం."
నరేంద్ర మోడీ
ప్రధాన మంత్రి

మీ ఊహలతో భవిష్యత్తును రంగులు వేయండి

శక్తి పరిరక్షణపై జాతీయ చిత్రలేఖన పోటీ - 2025

థీమ్‌లు : శక్తిని ఆదా చేయండి, భూమిని కాపాడండి | స్టార్‌గా ఉండండి- BEE స్టార్ ఉపకరణాలను ఉపయోగించండి

గ్రూప్ 'ఎ': 5వ,6వ మరియు 7 తరగతి
గ్రూప్ 'బి': 8,9 మరియు 10 తరగతి

పెయింటింగ్ విలువైన బహుమతులు

బహుమతి (ప్రతి విభాగంలో)	రాష్ట్ర / UT స్థాయి బహుమతి		జాతీయ స్థాయి బహుమతి	
	గ్రూప్ 'ఎ'	గ్రూప్ 'బి'	గ్రూప్ 'ఎ'	గ్రూప్ 'బి'
మొదటి బహుమతి/బంగారు పతకం (01 సంఖ్య.)	₹ 50,000/-	₹ 50,000/-	₹ 1,00,000/-	₹ 1,00,000/-
రెండవ బహుమతి/వెండి పతకం (01 సంఖ్య.)	₹ 30,000/-	₹ 30,000/-	₹ 50,000/-	₹ 50,000/-
మూడవ బహుమతి/కాంస్య పతకం (01 సంఖ్య.)	₹ 20,000/-	₹ 20,000/-	₹ 30,000/-	₹ 30,000/-
ప్రశంస బహుమతి (10 సంఖ్యలు.)	₹ 7,500/-	₹ 7,500/-	₹ 15,000/-	₹ 15,000/-

జాతీయ విజేతలకు ల్యాప్‌టాప్‌లు/టాబ్లెట్‌లు మరియు భారతదేశంలో అధ్యయన పర్యటనకు అవకాశం కూడా లభిస్తుంది!

నమోదు చేసుకోవలసిన పాఠశాల: www.paintings.beeindia.gov.in

పెయింటింగ్స్ సమర్పించడానికి చివరి తేదీ
07 నవంబర్ 2025

CBC 34106/15/0013/2526

బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (BEE)
భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ కింద ఒక చట్టబద్ధమైన సంస్థ
/beeindiadigital /bureauofenergyefficiency

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ప్రజాప్రయోజన ప్రకటన
ఆహార పరిరక్షణ, ప్రమాణాల అమలు విభాగం
fssai
Eat Right India

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా - ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, భారత ప్రభుత్వం

ముఖ్యమైన విటమిన్లు మరియు ఖనిజ లవణాలు కలిగిన పౌష్టిక ఆహారాన్నే కొనండి

పౌష్టికమైన బియ్యం & గోధుమ పిండి
ఫోలిక్ యాసిడ్: శిశువు పెరుగుదలకు & రక్తవృద్ధికి దోహదం చేస్తుంది
విటమిన్ బి-12: నాడీ వ్యవస్థ సజావుగా పని చేయడానికి, రక్త వృద్ధికి అవసరం
ఐరన్: రక్తహీనత (అనీమియా)కు గురి కాకుండా కాపాడుతుంది

పౌష్టికమైన పాలు & నూనె
విటమిన్- ఎ: రేచీకటి రాకుండా కాపాడుతుంది
విటమిన్ - డి: ఎముకల గట్టిదనానికి దోహదం చేస్తుంది

రెట్టింపు పౌష్టికతతో కూడిన ఉప్పు
ఐరన్: రక్తహీనతకు గురి కాకుండా కాపాడుతుంది
అయోడిన్: శారీరక ఎదుగుదల, థైరాయిడ్ మరియు మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది

+F FORTIFIED SAMPOORNA POSHAN SWASTH JEEVAN
ఈ లోగో చూసి కొనండి
ప్రజా ప్రయోజనార్థం FSSAI వారిచే జారీ చేయబడింది

పౌష్టిక ఆహారం అందించే బ్రాండ్‌ల గురించి మరింత సమాచారం కోసం fortification.fssai.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి

సలహాలు, ఫిర్యాదుల కోసం సంప్రదించండి
సంచాలకులు 08645 241 0295
జాయింట్ ఫుడ్ కంట్రోలర్ 94403 79755

జారీ చేసినవారు : ఆహారభద్రత కమీషనర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68